J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 18 8.10.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## బాబు - పవన్‌ల కొత్త ఎ(పొ)త్తు

# నవ్యాంధ్రలో నవ నాటకం



### ఊహించిందే జరగబోతోంది
### ఆ రెండు పార్టీలు కలవబోతున్నాయి
### ముందస్తు ఎన్నికల పుకారుతో మేల్కొంటున్న పార్టీలు
### ఎన్నికలు ఎప్పుడొచ్చినా చంద్రబాబుతో పవన్
### బీజేపీని ఏకాకిని చేసే వ్యూహం




***ఒకవైపు పథకాల పేరుతో ప్రజల అకౌంట్లలో నేరుగా లక్షల కోట్లు, మరోవైపు నవరత్నాలకు తోడుగా రోజుకో కొత్త సంక్షేమ పథకం. వీటన్నిటికీ తోడుగా అవసరమైతే ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి 50 కోట్లు పెట్టగల ఆర్థిక బలం. ఇలాంటి తరుణంలో, ఏకాకిగా సార్వత్రిక ఎన్నికల బరిలో దిగితే ముఖ్యమంత్రి పీఠం పైనుండి జగన్‌మోహన్‌రెడ్డిని కాదుకదా కనీసం ఆయన ఎడమ కాలు చిటికెన వేలును కూడా కదిలించలేమని తెలుగుదేశం, జనసేన అధినేతలకు స్పష్టత వచ్చేసింది.***

అవును. ఆ ఇద్దరికీ విషయం అర్థమైంది. విడివిడిగా పోటీచేస్తే కుడి ఎడంగా 2019 నాటి ఫలితాలే పునరావృతమయ్యే పరిస్థితులు రాష్ట్రంలో కనపడుతున్నట్టు టీడీపీ అంతర్గత సర్వేల ద్వారా చంద్రబాబునాయుడుకు బోధపడిపోయింది. అదే సమయంలో జనసేన పరిస్థితి కూడా క్షేత్రస్థాయిలో అస్సలు బాగలేదన్నది కాదన లేని సత్యం. టీడీపీతో పొత్తు పెట్టుకుని, బీజేపీ 'ధృతరాష్ట్ర కౌగిలి' నుంచి బయటపడాలని జనసేన 'సైన్యం' కూడా గట్టిగా పవన్ కళ్యాణ్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నదని సమాచారం. ముఖ్యంగా కాపు కులస్థులు అధిక సంఖ్యలో ఉన్న ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ డిమాండ్ జనసేన నుంచి గట్టిగా వినిపిస్తున్నట్లుంది. ఈ రెండు జిల్లాలలోనే దాదాపు 36 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ 20 స్థానాల్లో తాము బలంగా ఉన్నామని, కాకినాడ రూరల్‌లో రాష్ట్రమంత్రి కురసాల కన్నబాబుపై 2019 ఎన్నికలలో ఓడిపోయిన జనసేన నేత పంతం నానాజీ అంటున్నారు కూడా. క్షేత్రస్థాయిలో బీజేపీతో కలిసి పని చేయ డానికి జనసేన శ్రేణులు ఏమాత్రం ఆసక్తి కరంగా లేరని, తెలుగుదేశంతో కలవడాని కైతే వారు ఆసక్తికరంగా ఉన్నారని కూడా టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. జగన్ వ్యతిరేక ఓటులో చీలికను నివారించాల్సిన అవసరమైతే ఉందనే అభిప్రాయాన్ని జనసేనలో కలిగించడానికి చంద్రబాబు ఇప్పటికే తెరవెనుక కుస్తీపడుతున్నారు.

పరిషత్ పోరులో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, వీరవాసరం మండలాల్లో జనసేనకు టీడీపీ బాహాటంగా మద్దతు ఇచ్చింది. దాంతో, ఈ రెండు మండలా లను జనసేన కైవసం చేసుకుంది. ఫలి తంగా ఈ రెండు పార్టీల పొత్తుపై అటూ, ఇటూ ఆశలు చిగురించినట్టు స్పష్టమవు తోంది. అయితే, 'పొత్తు' అన్నది అధికారి కంగా... బహిరంగంగా ఉండాలని కూడా టీడీపీ డిమాండ్. 2019లో ఈ రెండు పార్టీల మధ్య 'రహస్య పొత్తు' ఉందనే ప్రచారం రెండు పార్టీల కొంప ముంచిం దని టీడీపీ సీనియర్ నేత ఫీలింగ్. ఒకవేళ ఈ రెండు పార్టీల మధ్య పొత్తు అంటూ కుదిరితే, తమకు చేకూరే లాభాలు ఏమిటో కూడా స్పష్టత ఇస్తే బాగుంటుందన్నది జనసేన సైన్యం కూడా అభిప్రాయపడుతోంది. అప్పుడు, కాపు సామాజికవర్గాన్ని టీడీపీతో అనుసంధానం చేయడం తమకు తేలికవు తుందని ప్రముఖ కాపు నేత, చిలకలూరిపేటకు చెందిన ఇమ్మడి సత్యనారాయణ అభిప్రాయం. టీడీపీతో పొత్తు అంటే భయపడే జనసేన నేతలు కూడా ఉన్నారు. 'బాబులో ఇంటెలెక్చువల్ హానెస్టీ' చాలా తక్కువని, అవసరం కోసం వందమాటలు చెప్పి, అవసరం తీరాక వదిలేస్తారన్న అభిప్రాయం కూడా జనసేన నేతలు కొందరిలో వ్యక్తం అవుతోంది.

ఏతా... వాతా ఈ రెండు పార్టీల మధ్య పొత్తు అయితే ఖాయంగా కనపడుతోంది. ఆంధ్రలోని 175 స్థానాల్లో ఏ ఒక్కదాని లోనూ కనీసం డిపాజిట్ వచ్చే పరిస్థితి బీజేపీకి లేకపోవడం కూడా పవన్‌కళ్యాణ్‌ను టీడీపీ వైపుకు నెడుతున్నట్టు కనపడుతు న్నట్టు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. జనసేనకు సీట్లను కేటాయించడంతో పాటు ఎన్నికల ఖర్చును టీడీపీయే భరిస్తుందనే గుసగుసలు కూడా రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి. నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని చక్కబెడుతున్నట్టు వార్త.

మొత్తం మీద జనసేనకు 35 నుండి 40 సీట్లు, కమ్యూనిస్టులకు చెరో ఐదూ ఇచ్చి 125 -135 సీట్లలో తాము పోటీ చేయాలనే ఆలోచనలో టీడీపీ నేతలు స్కెచ్ వేస్తున్నారు. ఒక విషయంలో మాత్రం టీడీపీ, జనసేన వర్గాలలో ఏకాభిప్రాయం కనపడుతోంది. అధికారికంగా పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్తేనే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటామన్నది ఇరుపార్టీ శ్రేణుల భావన. ఎన్నికలకు ఇంకా రెండు న్నరేళ్లు సమయం ఉన్నప్పటికీ పార్టీలన్నీ ఇప్పటి నుండే మేల్కొంటున్నాయన్నది మాత్రం వాస్తవం. జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ఎన్నికలకు వెళ్తారన్న పుకారు కూడా జోరుగా షికారు చేస్తుండడంతో ప్రధానపార్టీలలో చలనం ప్రారంభమైం దన్నది కాదనలేని నిజం.





# పరిశుభ్రతే పరమావధి

• చీపుర్లు చేతపట్టిన అధికారులు

పరిశుభ్రతే పరమావధి అంటూ జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ తదితర అధికారులంతా అక్టోబర్ 2న చీపుర్లు చేతపట్టి నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్ (సిఎల్‌ఏపి) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన 120 చెత్త తరలింపు వాహనాలతో, పారిశుధ్య సిబ్బంది, సంబంధిత అధికారుల సమన్వయ కృషితో నెల్లూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి జరుగుతోందన్నారు. కాలుష్యాన్ని పెంచే ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించవద్దని, ప్లాస్టిక్ రహిత నగరంగా నెల్లూరును తీర్చిదిద్దాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 50 శాతం కన్నా తక్కువ మైక్రాన్లున్న ప్లాస్టిక్ సంచులు వగైరాలను నిషేధించామన్నారు.

## కాణిపాకం ట్రస్టుబోర్డులో.. జిల్లా మహిళ

చిత్తూరుజిల్లాలో ప్రసిద్ది చెందిన కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయకుని ఆలయ ట్రస్టు బోర్డు సభ్యురాలిగా ఇందుకూరుపేటకు చెందిన భక్తురాలు వెంకటరమణమ్మ ఈనెల 2న ప్రమాణస్వీకారం చేశారు. ఇందుకూరుపేట మండలం సోమరాజుపల్లి మాజీ జడ్పీటిసి వెంకటరమణయ్య సతీమణి వెంకటరమణమ్మకు ఈ అరుదైన అవకాశం దక్కడం పట్ల మండల వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఆమెకు ఈ పదవి లభించడం విశేషం. ఈ సందర్భంగా డిఎల్‌డిఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో నాయకులు, అధికారులు ఆమెను ఘనంగా సన్మానించారు.

## మైపాడు బీచ్‌లో స్వచ్ఛభారత్



ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌లో అక్టోబర్ 2న గాంధీజయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఏపి టూరిజం శాఖ, మెరైన్‌శాఖ, స్థానిక పోలీసులు అందరూ కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ శివారెడ్డి, మెరైన్ సిఐ నారాయణ, ఎస్ఐ తిరుపతిరావు, స్థానిక ఎస్ఐ శ్రీనివాస రావుతో కలసి తీరప్రాంతంలో చెత్తను ఏరివేసి పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. మైపాడులోని హరిత రిసార్ట్స్ మేనేజర్ సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..

## ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని, ప్రజలను కష్టాలకు గురి చేయకుండా సుపరిపాలన అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ అన్నారు. ఈనెల 2న ఆయన ఆత్మకూరులోని చెర్లో రమణారెడ్డి స్మారకభవనంలో జరిగిన సిపిఎం 9వ మహాసభలో ప్రసంగించారు. తొలుత జక్కా వెంకయ్య ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు చేవూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఆత్మకూరు పట్టణ సిపిఎం కమిటీ ఎన్నికల్లో కార్యదర్శిగా దేవిడ్‌రాజు, సభ్యులుగా జివివిఎస్ ప్రసాద్, హజరత్తయ్య, షేక్ సందాని, ఎం.నాగేంద్ర, ఏ. హజరత్తయ్య, షేక్ గులాబ్‌జార్ ఎన్నికయ్యారు.



### గంగమ్మతల్లికి

## మంత్రి మేకపాటి పూజలు

రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో ఉన్న తన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లికి ఈనెల 5న వచ్చి తమ ఇష్టదైవమైన గంగమ్మతల్లికి పూజలు చేశారు. అమ్మవారు శక్తిస్వరూపిణి అని, కోరిన కోర్కెలు తీర్చే ఆ తల్లి ప్రజలందరినీ చల్లగా చూడాలని ప్రార్థించానని ఆయన చెప్పారు. తమ ఊరికి వచ్చినప్పుడల్లా తాను గంగమ్మ తల్లిని దర్శించుకోవడం ఎంతోకాలం నుంచి అలవాటని అన్నారు. అమ్మవారి ఆలయంలో కొద్దిసేపు గడిపి వచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

### నిరుపేదలకు

## నిత్యావసర సరుకులు

కోట మండలం సిద్దవరంలోని వైకాపా నాయకుడు దువ్వూరు ధ్రువకుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2న సిద్దవరం, ఇలుకూరుపాడు, చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామాల్లో పేదలకు నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. అదేవిధంగా సిద్దవరం, ఇలుకూరుపాడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీచేశారు. దువ్వూరు ధ్రువకుమార్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## రోగులకు వాకర్స్ పండ్లు, బ్రెడ్లు

నెల్లూరు సంతపేటలోని సెయింట్ జోసఫ్ ఆసుపత్రిలో ఈనెల 2న స్థానిక గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ వారు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి తమ సేవాభావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీతో పేదలకు అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు జయప్రకాష్, అరవ రాయప్ప, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వీల్‌ఛైర్లు

నెల్లూరులోని ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థవారు ఈనెల 2న అయిదుగురు దివ్యాంగులకు వీల్‌ఛైర్లు పంపిణీ చేశారు. నగరంలోని టౌన్‌హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ సువర్ణకుమారి, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ మాకినేని అరుణ పాల్గొని ఒక దివ్యాంగురాలికి కుట్టుమిషన్ అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయ సాధనకు కృషిచేయాలి

**- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**



పూజ్యబాపూజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. బాపూజీ 152వ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదిన ఆమె నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిసిసిబి మాజీ ఛైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, జడ్పీ పరిపాలనాధికారి వాణి, జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పెంచలకోన అభివృద్ధికి

## నిధులిచ్చి సహకరించండి

**టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి విన్నపం**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి టిటిడి ద్వారా నిధులు అందించి సహకరించాలని పెంచలకోన ఆలయం ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, రాపూరు ఎంపిపి చెన్ను బాలకృష్ణారెడ్డిలు టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 2న వారు బెంగుళూరులో టిటిడి బోర్డు ఛైర్మన్‌ను కలిశారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఆలయంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందుకు చేయూతగా టిటిడి నుంచి కూడా నిధులందించాలని వారు కోరారు. టిటిడి ఆధ్వర్యంలో పెంచలకోనలో రెండేళ్ళ క్రితం నిర్మించిన కల్యాణమండపం, వసతిగదుల సముదాయాలను ఇప్పటివరకు ప్రారంభించలేదని, త్వరలో మీరు వచ్చి వాటిని ప్రారంభించాలని వారు వైవిని కోరారు. టిటిడి బోర్డు ఛైర్మన్‌గా రెండోసారి పదవి చేపట్టినందుకు వైవికి వారు శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాలో..ఒకటే వాన!

వానలు కురుస్తుండడంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. అయినా మధ్య మధ్యలో ఎండ చురుక్కుమనిపిస్తూనే ఉంది. మంగళ, బుధవారాల్లో మాత్రం ఒకటే వాన. జిల్లాలో కొన్ని మండలాల్లో భారీగానే వాన కురిసింది. సరాసరి 38.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ చెప్తోంది. ముఖ్యంగా సూళ్ళూరుపేటలో పెద్ద వాన. బుధవారం ఒక్కరోజే 176.4 మిల్లీమీటర్ల వాన కురవడంతో పేటంతా బురదమయంగా మారింది. వెంకటగిరిలో కూడా 112.8 మి.మీ వాన కురిసింది. అదేవిధంగా ముత్తుకూరులో 99.2, ఇందుకూరుపేటలో 91.8, పెళ్ళకూరులో 88.6, దొరవారిసత్రంలో 88.4, మనుబోలులో 85.6, చిల్లకూరులో 82.6, తడ 75.2, గూడూరు 68.6, దక్కిలి 50.2, బాలాయపల్లి 49.6, తోటపల్లి గూడూరు మండలంలో 45.4 మి.మీల వంతున వర్షపాతం నమోదైంది. నెల్లూరులో కూడా విడతలు విడతలుగా వానజల్లులు కురుస్తూనే ఉన్నాయి. వాన పడిందంటే నెల్లూరు సోయగం సంగతి చెప్పాలా?..రోడ్లు మురికి కాలువలయ్యాయి. మోకాటిలోతు నీళ్ళతో ప్రధానమైన కూడళ్ళు, రోడ్లు అన్నీ బురదగుంటలుగా మారిపోయాయి. అటు వాన నీళ్ళు, ఇటు సైడు కాలువల్లోని మురుగునీళ్ళు కలగలిసిపోయి.. నగరమంతా కంపుగొట్టిపోయింది. ఈ రోతని ఇంకా ఎంతకాలం భరించాలోనంటూ నెల్లూరు జనం ముక్కులు మూసుకుంటున్నారు. అయినా.. ఏళ్ళ తరబడిగా ఈ దుర్గతిని మార్చేవాళ్ళెవరూ లేరు. ఆ భూగర్భ డ్రైనేజీ బాగుపడేదీ లేదు..ఈ మురికిగబ్బు మనల్ని వదిలేదీ లేదు!..

## రోడ్ల బాగుకు.. జనసేన శ్రమదానం



సర్వేపల్లి నియోజకవర్గంలో జనసేన నాయకుడు బి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో రోడ్ల బాగుకోసం జనసేన నాయకులు, కార్యకర్తలు శ్రమదానం చేశారు. అక్టోబర్ 2 గాంధీజయంతి సందర్భంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. సర్వేపల్లి నుంచి తిక్కవరప్పాడు, గొట్లపాళెం, గొలగమూడి గ్రామాలమీదుగా వెళ్ళే రోడ్డు పూర్తిగా దెబ్బతినిపోయినా ఎవరూ పట్టించుకోలేదని, సొంత నగదు వెచ్చించి ఈ రోడ్డును బాగుచేయిస్తున్నామని సురేష్‌బాబు ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి ఇందిరారెడ్డి, పినిశెట్టి మల్లికార్జున్, సందీప్, రవికుమార్, రామిరెడ్డి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

○ దేశంలోని అత్యుత్తమ పారిశ్రామిక పార్కుల్లో ఘనమైన గుర్తింపు

# దక్షిణ భారతదేశంలో నెంబర్-1 శ్రీసిటీ

## 13 అత్యుత్తమ సెజ్‌లలో శ్రీసిటీ ఒకటి




*వేలాదిమంది ఉద్యోగులు, శ్రామికులతో కళకళలాడుతున్న శ్రీసిటీ దక్షిణ భారతదేశంలో నెంబర్-1 పారిశ్రామిక వాడగా కేంద్రం నుంచి మంచి గుర్తింపును సాధించింది. అంతేకాదు, దేశంలోని అత్యుత్తమ పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ గొప్ప స్థానం సంపాదించడం విశేషం. ఈనెల 5వ తేదీన ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ ర్యాంకులు ప్రకటించారు.*

పరిశ్రమలకు అనువైన అద్భుతమైన వాతావరణం, పుష్కలమైన మౌలిక వసతులతో శ్రీసిటీ సాధిస్తున్న పారిశ్రామిక ప్రగతికి గుర్తింపుగా ఇప్పటికే ఎన్నో అవార్డులు, పురస్కారాలు లభించాయి కూడా. తాజాగా శ్రీసిటీ అత్యుత్తమ పనితీరుతో ఉన్నత ప్రమాణాలతో రాణిస్తూ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి సంస్థగా పేరు తెచ్చుకుంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) అక్టోబరు 5వ తేదీన విడుదల చేసిన ఇండస్ట్రియల్ పార్క్ రేటింగ్ సిస్టమ్ (ఐఆర్‌పిఎస్)లో దేశంలోని 41 అత్యుత్తమ పారిశ్రామికపార్కుల్లో శ్రీసిటీ ఒకటిగా గుర్తింపును పొందడమే కాక, దేశంలోని 13 అత్యుత్తమ సెజ్‌లలో శ్రీసిటీ ఒకటిగా ర్యాంకు సాధించి శ్రీసిటీ తన ప్రత్యేకతను చాటుకుంది. అంతేకాదు, దక్షిణ భారతదేశంలోనే ఈ ర్యాంకును పొందిన ఏకైక పారిశ్రామిక పార్కు శ్రీసిటీ కావడం విశేషం. దీంతోపాటు ఐఆర్‌పిఎస్ రేటింగ్ ప్రకారం అత్యున్నతస్థాయి పనితీరు కనపరచిన దేశంలోని 14 అత్యుత్తమ పనితీరు కలిగిన ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో ఒకటిగా, 15 టాప్ రేటెడ్ సెక్టార్ పార్కుల్లో శ్రీసిటీ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఇఎంసి) ఒకటిగా గుర్తింపును కూడా పొందింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ శ్రీసిటీ అగ్రశ్రేణి ఇండస్ట్రియల్ పార్కుగా గుర్తింపు పొందడం మన జిల్లాకే కాదు.. రాష్ట్రానికి, దేశానికే గర్వకారణం. ఈనెల 5వ తేదీన ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి సోమ్‌ప్రకాష్ ఇండస్ట్రియల్ పార్క్ రేటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడ్ వెర్షన్‌ని ప్రారంభించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పారిశ్రామిక పార్కులు ర్యాంకులను ఇచ్చారు. డిపిఐఐటి సెక్రటరీ అనురాగ్‌జైన్, ఇన్వెస్ట్ ఇండియా ఎం.డి, సిఇఓ దీపక్ బాగ్లా ఆసియా అభివృద్ధి బ్యాంకు డైరెక్టర్ జనరల్ (దక్షిణాసియా) కెనిచి యోకోయమా తదితరులు ఇందులో పాల్గొన్నారు.

### ఈ గౌరవం..గర్వకారణం - శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

దేశవ్యాప్తంగా శ్రీసిటీకి ఈ రేటింగ్‌లలో ర్యాంకు సాధించడం శ్రీసిటీకి గర్వకారణమని, ఈ గొప్ప గౌరవం పొందడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలకు, పారిశ్రామిక స్నేహపూర్వక వాతావరణానికి, స్థిరమైన పర్యావరణ ఉత్తమ పద్ధతులకు ఇది నిదర్శనమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# జిల్లాలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి

## కొత్తకోడూరులో రొయ్యలసాగు పరిశీలన



కేంద్ర మత్స్యశాఖ, సమాచార ప్రసారశాఖల మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ ఈనెల 7న జిల్లాలో పర్యటించారు. తోటపల్లి గూడూరు మండలంలోని కొత్తకోడూరు వద్ద ఉన్న బయోఫ్లాక్ ఇంటెన్సివ్ ఫార్మింగ్ పద్ధతిలో చేపడుతున్న రొయ్యలసాగును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రొయ్యలసాగు చేస్తున్న యజమాని నిషాంత్‌రెడ్డితో మాట్లాడి రొయ్యలసాగు వివరాలు తెలుసుకున్నారు. సాధారణ పద్ధతుల్లో సాగుచేస్తే హెక్టారుకు 5 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, బయోఫ్లాక్ ఇంటెన్సివ్ ఫార్మింగ్ పద్ధతిలో సాగుచేస్తే హెక్టారుకు 160 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని నిషాంత్‌రెడ్డి ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి నెల్లూరు రూరల్ మండలంలోని ధనలక్ష్మీపురంలో ఉన్న ఫ్రెష్ ఫిష్ దుకాణాలను పరిశీలించారు. మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, కేంద్ర మత్స్యశాఖ సెక్రటరీ బాలాజీ, జేసీ హరేందిరప్రసాద్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఆప్కాబ్ ఛైర్మెన్ అనిల్‌బాబు, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ డైరెక్టర్ ఆంటోని, ఏడీలు ప్రసాద్, చాంద్‌బాసా, శ్రీనివాసులు పాల్గొన్నారు.







## 'ప్రభా'తం

# మాయమవుతున్న భావితరం

**బాలబాలికల అదృశ్యం (మిస్సింగ్ కేసులు) ఘటనలు నానాటికీ పెరిగిపోతున్నాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి కేసులు ఎన్నో ఉన్నా..ఒక్క ఆంధ్రప్రదేశ్ విషయం చూసినా బాలబాలికలు ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట తప్పిపోతున్న సంఘటనలు అందరినీ కలచివేస్తూనే ఉన్నాయి. వాళ్ళెలా అదృశ్యమైపోతున్నారో.. చివరికి ఎవరికి చిక్కి ఏమైపోతున్నారో ఎవరికీ అంతుపట్టడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి రక్షణకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా నేటికీ కనిపించకుండాపోతున్న బాలల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. వెంటనే వారిని గుర్తించి రక్షించేందుకు ప్రభుత్వాలు మానవతా హృదయంతో మునుపటికంటే గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రతిప్రాంతంలోనూ ప్రత్యేక కమిటీలను వేసి వారిని ఆదుకునేందుకు సకల చర్యలు తీసుకోవాలి.**

కారణాలేమైతేనేం..బాలబాలికల అదృశ్యం (మిస్సింగ్ కేసులు) ఘటనలు నానాటికీ పెరిగిపోతుండడం దురదృష్టకరం. దేశవ్యాప్తంగా ఇలాంటి కేసుల సంఖ్య గణనీయంగానే ఉంటోంది కూడా. ఒక్క ఆంధ్రప్రదేశ్ విషయం చూసినా రాష్ట్రంలో భావితరానికి ప్రతినిధులైన బాలబాలికలు ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట తప్పిపోతున్న సంఘటనలు అందరినీ కలచివేస్తూనే ఉన్నాయి. వాళ్ళెలా అదృశ్యమైపోతున్నారో.. ఎక్కడకి పోతున్నారో.. చివరికి ఎవరికి చిక్కి ఏమైపోతున్నారో అంతుపట్టడం లేదు. ఏ మాయగాళ్ళ వలకు దొరికిపోయి తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారో ఎవరికీ తెలియడం లేదు. కన్నవాళ్ళనీ, ఉన్న ఊళ్ళనీ వదిలిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోతే, అభం శుభం తెలియని ఆ బాలల దుస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో చెప్పలేం. కేంద్రప్రభుత్వం పరిధిలోని నేషనల్ క్రైమ్‌బ్యూరో తాజా నివేదికలో రాష్ట్రంలో అదృశ్యమైపోతున్న బాలల సంఖ్య భారీగానే ఉండడం ఆయా కుటుంబాల వారినే కాక సామాజికంగా ప్రజలందరి హృదయాలను బాధిస్తోంది. గత రెండేళ్ళుగా బాలల అదృశ్యం ఘటనలు పెరుగుతుండడం గమనార్హం. 2020 నుంచి ఈ కేసుల సంఖ్య క్రమేణా పెరుగుతూ వస్తోందని, 2019లో అలా మిస్సయిపోతున్న వారి సంఖ్య 14,941 మంది ఉంటే, అందులో 2746 మంది బాలలు ఉన్నారని ఆ నివేదిక వెల్లడిస్తోంది. అంతేకాదు, గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు దాకా ఆంధ్రప్రదేశ్‌లో 15,754 మంది తప్పిపోయారని, అందులో మైనర్లు 2,754 మంది దాకా ఉన్నారని తేల్చింది. ఇలా తప్పిపోయిన మహిళలు, బాలికలు, బాలలు ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారో, ఏ పరిస్థితుల్లో ఉంటున్నారో అనూహ్యం. ఆలోచించడానికే బాధనిపించే ఇలాంటి ఘటనలను నివారించడానికి అటు ప్రభుత్వం, ఇటు పోలీసు యంత్రాంగమంతా ఎంతగానో కృషిచేస్తూనే ఉంది. ఇప్పటికే వేలాదిమంది బాలలను గుర్తించి వారిని తల్లిదండ్రుల వద్దకో లేదా శరణాలయాల్లోనో చేర్పించి వారి జీవితాలను ఒడ్డున పడేయడానికి అన్నిరకాల చర్యలను తీసుకుంటూనే ఉంది. నిరుపేద బాలలకు విద్య, అన్నివిధాలైన వసతులు అన్నీ కల్పిస్తూనే ఉంది. అయినా, నేటికీ మిస్సింగ్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో రోజుకో బాలిక ఎక్కడో ఒకచోట అదృశ్యమవుతున్నదనే చేదునిజం అందరినీ ఆందోళనకు గురిచేస్తూనే ఉంది. గత ఏడాది 372 మంది బాలికలు కనిపించకుండా పోయారని, మరో 264 మంది బాలుర ఆచూకీ తెలియడం లేదని, వారేమైపోయారో అంతుచిక్కడం లేదని కూడా ఆ నివేదిక చెప్తోంది. అలా మాయమైనవాళ్లు ఇంకా బతికున్నారా.. ఉంటే ఎలాంటి స్థితిలో ఉన్నారు.. వారి ఆనవాళ్ళు ఎక్కడ?.. ఎవరి చేతుల్లో పడి ఏమైపోయారో...అనుకుని రోదిస్తూ వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పడే బాధ వర్ణనాతీతం.

సమాజంలో నానాటికీ పాశ్చాత్య విషపు సంస్కృతి, దురాచారాలు, దుష్ట చేష్టలు పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రత్యేకించి బాలికలపై అఘాయిత్యాలు ప్రబలిపోతూనే ఉన్నాయి. ఇళ్ళలోంచి వెళ్లిపోయిన బాలలు..ఆకలికి తట్టుకోలేక ఏ చెత్తకుప్పల్లో ఎంగిలి మెతుకులు ఏరుకుంటున్నారో, ఎవరి బారినపడి బాధలు పడుతున్నారో అర్థం కావడం లేదు. అందులోనూ ఇప్పటి కరోనా మహమ్మరి వ్యాధి నేపథ్యంలో బయటకు వెళ్తే అ వ్యాధి ఎక్కడ అంటుకుంటుందోనని అందరూ భయపడుతున్న సమయంలో ఇళ్ళనుంచి కన్నబిడ్డలు వెళ్ళిపోతే ఆ తల్లిదండ్రుల బాధ ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించలేం. దుర్భర దారిద్ర్యంతోనో, లేదా కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రుల అనాదరణ వల్లనో, లేదా ఇంకా ఏ ఇతర కారణాల వల్లనో బాలలు ఇళ్ళ నుంచి ఎవరికీ చెప్పకుండా గడప దాటిపోతుండడం ఎంతో ఆవేదన కలిగించే విషయం. సమాజం పట్ల సరైన అవగాహన లేకపోవడంతో పాటు ఒకపక్క అజ్ఞానం, మరో పక్క అమాయకత్వం కలగలిసి బాలల జీవితాలను అంధకారబంధురం చేస్తున్నాయి. ప్రత్యేకించి ఎక్కడ చూసినా ఆడపిల్లల పట్ల లైంగిక దాడులు పెరిగిపోతున్న నేటి పరిస్థితుల్లో, నేరాలు ఘోరాలు పెచ్చరిల్లిపోతున్న తరుణంలో.. తమకు దొరికినవారిని మాయచేసి వ్యభిచార కూపాల్లోకి నెట్టేసే క్రూరులున్న నేటి సమాజంలో ఇళ్ళ నుంచి వెళ్లిపోయిన తమ బిడ్డల గతి ఏమైపోయి ఉంటుందనే వేదనతో తల్లిదండ్రులు అనుక్షణం తల్లడిల్లిపోతూనే ఉన్నారు.

ఒకచోట అదృశ్యమైనా మరోచోట ప్రత్యక్షం కావాల్సిందే కదా!..కనుక, తప్పిపోయిన బాలలు ఇప్పుడు ఎక్కడ.. ఏ స్థితిలో ఉన్నారో వారి ఆచూకీ కనుగొనేందుకు ప్రతి ఊరిలోనూ, ప్రతిచోటా పెద్దలు, స్వచ్ఛంధసంస్థలు, అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీలను నియమించాలి. తప్పిపోయిన బిడ్డను తల్లి ఒడికి చేర్చడం కంటే పుణ్యం ఇంకేముంటుందీ!.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాల పట్ల మరింతగా దృష్టిసారించాలి. అదృశ్యమైన బాలలను గుర్తించి వారిని రక్షించేందుకు మానవతా హృదయంతో అన్నివిధాలా సహకరించాలి. మునుపటి కంటే మరింత గట్టి కృషితో బాలలను రక్షించేందుకు ముమ్మర చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పోలీసులు, అధికారులు, నాయకులు, సేవా సంస్థల వారు, మేధావి వర్గాల వారు, మానవతా హృదయులంతా కలసి అదృశ్యమైన బాలలను గుర్తించి వారిని రక్షించేందుకు సర్వశక్తులూ వినియోగించాలి. ప్రతిప్రాంతంలోనూ ఎక్కడికక్కడ బాలల సంరక్షణ కమిటీలు వేసి మిస్సయిన వారిని వెతికించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎవరూ లేకుండా రోడ్లపై ఒంటరిగా..అనాథల్లా తిరుగుతున్న బాలలను గుర్తించి వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా చొరవ తీసుకోవాలి. ఏదేమైనా.. బాలల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి. ఇది మానవీయమైన విషయం కనుక, మానవత్వంతో ప్రతి ఒక్కరూ అందుకు తమవంతు తోడ్పాటునందివ్వాలి.




# బాపూజీ స్ఫూర్తితో.. సేవా కార్యక్రమాలు

## పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు పినాకిని గాంధీజీ ఆశ్రమంలో గాంధీ జయంతి కార్యక్రమాలు ఈనెల 2న ఘనంగా జరిగాయి. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ, కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డితో పాటు కమిటీ సభ్యులు గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ నిర్మాణకర్త పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీజీ స్ఫూర్తితో మనమంతా సమాజ సేవాకార్యక్రమాలు చేపడుదామని సభ్యులకు పిలుపునిచ్చారు. గాంధీజీ పల్లిపాడు ఆశ్రమానికి విచ్చేసి స్వాతంత్ర్యసమరయోధులకు, ప్రజలకు స్ఫూర్తిని కలిగించడం ఒక మరపురాని ఘట్ట మన్నారు. దక్షిణ భారత సబర్మతిగా పేరుగాంచిన పల్లిపాడు ఆశ్రమాన్ని మరింతగా అభివృద్ధిచేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతునాయకుడు చిరసాని కోటిరెడ్డి, బిజెపి నాయకురాలు రాజేశ్వరితో పాటు కాళిదాసు పురుషోత్తం, శ్రీదేవి, పెనుబల్లి హనుమంతురావునాయుడు, భాస్కర్‌రెడ్డి, బి.రాజేంద్రప్రసాద్, కరణం సుభాషిణి, గంటా విజయశ్రీ, యు.అనూరాధ, జి. తిరుపతయ్య, లయన్ వైవి సుబ్బారావు, రామిరెడ్డి, మోహన్‌లాల్‌జైన్, జి.మంజుల, రాయసం దామోదర్‌రావు, సాయిమనోజ్ పాల్గొన్నారు.

# పెంచలకోన ఆలయానికి భారీ రాబడి

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం, పెంచలకోనలో వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి ఈసారి భారీ రాబడి వచ్చింది. ఈనెల 4న ఆలయం హుండీలతో పాటు అన్నదానం హుండీని కూడా లెక్కించగా భక్తులు సమర్పించిన కానుకలు కోటీ 9 లక్షలా 45 వేలా 168 రూపాయలు వచ్చాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు 235 గ్రాముల బంగారం 5 కేజీల 400 గ్రాముల వెండి కానుకలుగా వచ్చినట్లు పేర్కొన్నారు.

# ప్లాస్టిక్‌పై నిషేధం.. అమలయ్యేనా?

నెల్లూరులో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించడం ఎంతో సంతోషకరం. అభినందనీయం కూడా. అయితే, ఇది అమలవుతుందా అన్నదే సందేహం. గతంలో కూడా నిషేధం విధించామని చెప్పారే కానీ, అమలుకు నోచుకోలేదు. ఎక్కడబట్టినా ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తూనే ఉన్నారు. చిన్నచిన్న వస్తువులకు కూడా ప్లాస్టిక్ కవర్లే. హోటళ్ళలో, పెద్దపెద్ద దుకాణాల్లో ఒకచోటని ఏమిటి.. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే. కాసేపు వాడేయడం.. పారేయడం. ఎవరెంత చెప్పినా పరిస్థితిలో మార్పు ఉండడం లేదు. రోడ్ల మీద పారేసిన ప్లాస్టిక్ కవర్లను తిని పశువులు ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నా, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం బాగా దెబ్బతింటుందని చెప్తున్నా, వందల సంవత్సరాలైనా అవి భూమిలో కలసిపోవని, అందువల్ల మానవ మనుగడకే ముప్పు వస్తుందని ఎంతగా చెప్పినా వాటి వినియోగంలో ఆశించిన మార్పులు ఉండడం లేదు. ప్రతిరోజూ నిత్యావసర సరుకులు తెచ్చుకునేవారికి, ప్రతిదానికీ ప్లాస్టిక్ కవర్లే అందుబాటులో ఉంటున్నాయి. చేతపట్టుకునేందుకు సునాయాసంగా ఉంటాయి కనుక విధిలేని పరిస్థితుల్లో ప్రజలు వాటిని వినియోగిస్తున్నారు. గతంలో గుడ్డ సంచులు బాగా వాడేవారు. ఇప్పుడది ముతకైపోయింది. ప్లాస్టిక్ ఫ్యాషనైపోయింది. ఆహారపదార్థాలను కూడా అరిటాకులు, తడాకుల్లోనో, కాగితాల్లోనే చుట్టి ఇచ్చేవారు. అరిటాకు భోజనం ఆరోగ్యానికి కూడా మంచిదే. ఎవరు పట్టించుకుంటున్నారు?.. ఏ పొట్లం కట్టాలన్నా పల్చటి ప్లాస్టిక్ కాగితాల్లోనే. వద్దనడానికి, కాదనడానికి వీలు లేని పరిస్థితి. నీళ్ళు తాగేందుకు స్టీలు లోటాలుండేవి. ఇప్పుడంతా ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులే. తాగడం పారేయడం. ఒక్క




రోజుకే ఇలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వేల టన్నుల్లో పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్‌పై నిషేధం మంచిదే. కానీ, వాటి స్థానంలో ప్రత్యామ్నాయం ఏమిటనే విషయంపై కూడా ఆలోచించాలి. ప్లాస్టిక్ కవర్లను విక్రయించడం, వినియోగించం నిషేధించామంటున్నారు. కానీ వాటిని అంగళ్ళవారు కొనకుండా, ఇతరులకు అమ్మకుండా, వినియోగదారులకు వాటిని ఇవ్వకుండా చేస్తే సరిపోతుంది కదా?.. అసలు హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల తయారీపైనే దృష్టిసారించి నిలువరిస్తే ఇక వినియోగం ఎక్కడుంటుంది?.. తయారీయే లేకుంటే వినియోగం ఎలా ఉంటుంది?.. అధికారులకు ఇదంతా తెలియదని అనుకోలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చొరవ తీసుకుని పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధం చేందుకు చర్యలు తీసుకుంటే పూర్తిస్థాయి నిషేధం దాదాపు అమలైనట్లే. అదే విధంగా, ప్లాస్టిక్ వినియోగంపై సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించాలి. బడుల్లో, కాలేజీల్లో విద్యార్థులకు ప్లాస్టిక్ ముప్పు గురించి గురువుల చేత పదేపదే చెప్పించాలి. గతంలో మాదిరిగా గుడ్డ సంచులు, కాగితపు అట్ట సంచులు, జౌలి సంచుల వినియోగాన్ని బాగా పెంచాలి. వీలైతే వాటి ధరను బాగా తగ్గించాలి.

**జి.కాత్యాయిని, నెల్లూరు.**

# 'లాయర్' బాగుంది

'లాయర్' వారపత్రిక బాగుంది. వారం వారం ఇచ్చే వార్తాకథనాలు, ముద్రణా నాణ్యత మా ఇంటిల్లిపాదినీ బాగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా గత వారం షర్మిలమ్మ బాట–మాట వల్ల దివంగత నేత వైఎస్సార్ అభిమానులు, జగనన్న అభిమానుల మనసుల్లో ఉన్న ఆవేదనంతా ఉన్నదున్నట్లుగా చెప్పడం మాకెంతో నచ్చింది. మీ మాటలు అక్షరసత్యాలు. జనం కోసం ముందుకు వస్తున్న ఒక మహిళానాయకురాలిని 'నువ్వు' అంటూ ఏకవచనంతో సంబోధించడం ఎవరికైనా సభ్యత కాదు కదా!..'లాయర్' ఇలాంటి మంచి విషయాలను చెప్తున్నందుకు సంతోషంగా ఉంది.

**ఆర్.మల్లికార్జున, తోటపల్లిగూడూరు.**



# విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలి

## - విపిఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ తమ విద్యాప్రతిభను మెరుగుపరచుకోవాలని, తద్వారా భావిభారత పౌరులుగా ఎదగాలని విపిఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. ఈనెల 6న ఆమె విపిఆర్ విద్యలో జరిగిన కార్యక్రమంలో ఆమె 6వ తరగతి ప్రవేశపరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఆరేళ్ళుగా విపిఆర్ విద్యలో నిరుపేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది కూడా సుమారు 300 మంది దరఖాస్తు చేసుకోగా, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వారికి ప్రవేశపరీక్ష నిర్వహించి 32 మంది విద్యార్థుల ఆర్థిక స్థితిగతులను, ప్రతిభను పరిశీలించి ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన ఆశయాలకు అనుగుణంగా విపిఆర్ విద్యను క్రమశిక్షణతో నిర్వహిస్తూ తనవంతు బాధ్యతను నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యతోనే జ్ఞానం, సామాజిక పరిజ్ఞానం అలవడుతాయని, అంధకారం దూరమవుతుందని, విద్యతోనే సమాజంలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పాఠవాలను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ విటి శ్రీనివాసన్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌హెచ్ కళ తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష విజ్ఞానంలో అతివల పాత్ర అమోఘం

## - తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్




అన్ని రంగాలతో పాటు అంతరిక్ష రంగంలోనూ మహిళలు ముందుకు దూసుకుపోతున్నారని, అంతరిక్ష విజ్ఞానంలో అతివల పాత్ర ఎంతో అమోఘమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఈనెల 4న ఆమె శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్‌లో 'ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు -2021'ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 'అంతరిక్షంలో మహిళలు' అనే అంశంపై గవర్నర్ మాట్లాడుతూ ఎంతటి సమస్యనైనా ఓర్పు నేర్పుతో పరిష్కరించుకునే సత్తా మహిళలకుందని అన్నారు. అందుకే అవనిపైనే కాదు అంతరిక్ష రంగంలోనూ మహిళలు తమ ప్రతిభా పాటవాలు చాటుతున్నారన్నారు. కల్పనా చావ్లా, సునీత విలియన్స్, శిరీషా బండ్ల, డాక్టర్ స్వాతిమోహన్ తదితరులంతా అంతరిక్ష యానం చేసి మహిళాలోకానికి స్ఫూర్తినిచ్చారన్నారు. మహిళలకు అవకాశమిస్తే అన్నిరంగాల్లోనూ అగ్రస్థానంలో ఉంటారన్నారు. మహిళలకు ఎంతో గౌరవం ఇస్తూ వారికి తగు ప్రాముఖ్యతను ఇస్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను అభినందించారు. రాకెట్ ప్రయోగ సమయాల్లో కంట్రోల్‌రూమ్‌లో వివిధ రంగాల్లో విధుల నిర్వహిస్తున్న మహిళలను చూసినప్పుడు ఎంతో సంతోషం కలిగిందన్నారు. మహిళలు అన్నిరంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. శ్రీహరికోట రాకెట్ ప్రయోగకేంద్రం నుంచి ఎన్నో భారీ ఉపగ్రహ ప్రయోగాలను విజయవంతంగా చేపట్టి భారత కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దేశ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రస్తావిస్తూ ప్రధాని చేపట్టిన ఆత్మనిర్భర్ కార్యక్రమాల ప్రగతిని వివరించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికి 65 మంది మహిళా వ్యోమగాములు అంతరిక్షయాత్ర చేశారని, ఇటీవల మార్స్‌పై ఉపగ్రహ ప్రయోగం సందర్భంగా భారతీయ మహిళా శాస్త్రవేత్త చేసిన కృషి ఎంత గొప్పదో చెప్పారు. షార్‌లో 268 మంది మహిళలు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు షార్ అధికారులు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. వారోత్సవాల కమిటీ ఛైర్మెన్ డాక్టర్ ఆర్ వెంకటరామన్, షార్ అసోసియేట్ డైరెక్టర్ ఎంబిఎన్ మూర్తి, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ హరీందరప్రసాద్, అడిషనల్ ఎస్పీ వెంకటరత్నంతో పాటు షార్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలుత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూళ్ళూరు పేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు.

### కోవిడ్ నిబంధనలతో..

# ఏఎస్‌పేట గంధమహోత్సవాలు



- ఆర్డీఓ చైత్రవర్షిణి

జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఏఎస్‌పేట దర్గాలో కోవిడ్ నిబంధనలతో గంధమహోత్సవాలు చేపట్టనున్నామని, భక్తులకు అనుమతి లేదని ఆత్మకూరు ఆర్డీఓ చైత్రవర్షిణి తెలిపారు. ఈనెల 2న ఈ ఉత్సవాల నిర్వహణపై ఆమె అధికారులతో సమావేశమై ఏర్పాట్ల విషయం చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14,15, 16 తేదీల్లో దొరసానమ్మ గంధమహోత్సవాలు, నవంబరు 1,2,3 తేదీల్లో హజరత్ ఖాజానాయబ్ రసూల్ గంధమహోత్సవాలు నిర్వహించనున్నారు, దర్గా నిర్వాహకులు పరిమిత సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులతో పాటు జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తీర్చడం కోసమే..'ప్రజా హక్కు'

## - మంత్రి డాక్టర్ అనిల్



ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రజాహక్కు కార్యక్రమం లక్ష్యమని, ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 6న ఆయన నెల్లూరు నగరంలోని 51వ డివిజన్ కపాడిపాళెంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ప్రజాహక్కు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని తీర్చేందుకు అధికారులు అప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజాహక్కు కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులుంటారని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇక్కడే నిర్ణయం తీసుకోవచ్చని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడడమే కాకుండా, ప్రజల సమస్యలు తీర్చేవిధంగా సచివాలయ సిబ్బంది కృషిచేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాలు ఏర్పాటుచేశారని, ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలు తీర్చేవిధంగా సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, వైఎస్సార్‌సీపి నాయకులు సురేష్‌బాబు, బాలాప్రసాద్, ఆనంద్‌బాబు, చిట్టి, సరిత, ప్రమీల,ఉమా, రమేష్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో జిల్లాకు పతకాలు

ఈనెల 2,3 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. సీనియర్ మహిళా విభాగంలో మల్లి పావని ఈ పోటీల్లో వెండి పతకం సాధించగా, షేక్ సుమయ్య కాంస్యపతకం, పురుషుల సీనియర్ విభాగంలో పి.వినీత్ బంగారు పతకం సాధించారని, పి.హర్షసాయి వెండిపతకం, పి.సుమంత్, పి.ప్రవీణ్‌లు కాంస్య పతకాలు సాధించారని జిల్లా రెజ్లింగ్ కమిటీ అధ్యక్షుడు షేక్ రిజ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని ఈనెల 20 నుంచి 23వతేది వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపనున్నామని వారు తెలిపారు.

### విద్యుత్‌శాఖలో

# బదిలీల పర్వం

విద్యుత్‌శాఖలో బదిలీల పర్వం ప్రారంభమైంది. ఏఇలు, ఏడిఇల బదిలీకి విద్యుత్‌సంస్థ (ఎస్పీడిసిఎల్) తాజాగా ఈనెల 5 న బదిలీలకు మార్గదర్శకాలు చేసింది. నెల్లూరు సర్కిల్‌లో 25 మంది ఏఇలు, ఏడుగురు ఏడిఇలు బదిలీలకు అర్హులని, ఒకేచోట మూడు సంవత్సరాలు, ఒకే డివిజన్‌లో అయిదు సంవత్సరాలు పూర్తయినవారి జాబితాను విడుదల చేసింది. దీంతో ఈ నెల 7వ తేదీలోపు బదిలీలపై వారి విన్నపాలు స్వీకరించడం, ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వాటిని పరిశీలించి ఈనెల 11న బదిలీల జాబితా ప్రకటించనున్నారని సమాచారం.

# సజ్జలను కలిసిన ఆనం విజయ



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఈనెల 5న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. తాడేపల్లిలోని వైకాపా కేంద్ర కార్యాలయంలో ఉన్న సజ్జలకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఆనం అరుణమ్మ ఎంపిక కావడంపై సజ్జల వారికి తన అభినందనలు తెలిపారు.

# వన్యప్రాణులను కాపాడుకుందాం

అడవులను కాపాడుకుంటూ వన్యప్రాణులను సంరక్షించుకుని భావితరాల వారికి మార్గదర్శకంగా ఉందామని జిల్లా డెప్యూటీ అటవీ అధికారి పిచ్చిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 2న 67వ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వన్యప్రాణుల పట్ల అందరూ దయతో ఉండాలని, వాటిని హింసించకూడదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అటవీశాఖ అధికారి సంపత్‌కుమార్, పాఠశాల హెడ్‌మాస్టర్ ఫయాజుద్దీన్‌లతో పాటు మహేష్, మల్లికార్జున, శ్రీనివాసులురెడ్డి, తిరుపాలు, మోహన్, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, సావిత్రి, అరుణ, భవాని, రవిచంద్ర, శ్రీనివాసులు, సలాం తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రెడ్‌క్రాస్‌లో..
## పేదలకు నిత్యావసర సరుకులు



జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 6న పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చర్మకారులకు, చిత్తు కాగితాలు ఏరుకుని జీవించే నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కోవిడ్ కష్టకాలంలో జాన్‌హకోప్కిన్స్ యూనివర్శిటీవారి సౌజన్యంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించామన్నారు. కోవిడ్ కష్ట సమయంలోనూ, లాక్‌డౌన్ కాలంలోనూ నెల్లూరు రెడ్‌క్రాస్ వేలాదిమంది బాధితులు, నిరుపేదలకు తనవంతు సేవలందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లాశాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, యడవల్లి సురేష్, దాసరి రాజేంద్రప్రసాద్, ఎఆర్‌వి ప్రాజెక్టు కన్వీనర్ బి.వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

**- డిసిసి నేత చేవూరు**



దేశం కోసం త్యాగం చేసిన జాతిపిత మహాత్మా గాంధీజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆ మహనీయుని ఆదర్శాల బాటలో నడవాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న బాపూజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో జాతిపిత మహాత్మాగాంధీ 152వ జయంతిని, మాజీ ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను జరుపుకుంటున్నామని అన్నారు. గతంలో తెల్లదొరలు నిరంకుశ పాలన సాగిస్తే, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కూడా అదే ధోరణిలో ఉంటోందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. దేశంలో గ్యాస్, డీజిల్, పెట్రోల్ వగైరా నిత్యావసర సరుకుల ధరలన్నీ పెరిగిపోవడంతో ప్రజలు నానా యాతనలు పడుతున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావు, షేక్ ఫయాజ్, ఏటూరు శ్రీనివాసులు, కొండా అనిల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్‌బాబు, ఐఎన్‌టియుసి అధ్యక్షులు షేక్ మస్తాన్‌బాషా, డిసిసి ప్రధాన కార్యదర్శులు అరవ రామ్మోహన్‌రావు, షేక్ హుస్సన్ బాషా, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌సి వాకర్స్ ఆధ్వర్యంలో...



జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. బాపూజీ దేశానికి చేసిన మహనీయమైన సేవలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ మాజీఅధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు అమ్మ ఫర్నిచర్ మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డిలతో పాటు వాకర్స్ శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, ఎం.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత వీరంతా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# నెల్లూరు కబుర్లు

## జడ్పీకి కొత్త సిఇఓ



నెల్లూరు జడ్పీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సిఇఓ)ఉన్న సుశీలను ఇటీవల బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ స్థానంలో సిఇఓగా కృష్ణాజిల్లా డిఆర్‌డిఏ పి.డి, సబ్‌కలెక్టర్ శ్రీనివాసరావును నియమించింది. జడ్పీకి ఇటీవలి దాకా పాలకవర్గం లేకపోవడంతో ప్రత్యేక అధికారి హోదాలో సుశీల రెండేళ్లపాటు పనిచేశారు. ఇప్పుడు పాలకవర్గం ఏర్పడటంతో ఆమెను పంచాయతీరాజ్‌శాఖకు పంపి, శ్రీనివాసరావును సిఇఓగా నియమించారు.

## విఎస్‌యులో గాంధీజయంతి



నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీలో అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విఎస్‌యు రెక్టార్ చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డిలు పాల్గొని మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేశారు. అదేవిధంగా లాల్‌బహుదూర్‌శాస్త్రి 117వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి వారు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాల బాటలో నడిచి దేశపురోభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, విజయానంద్‌బాబు, నీలమణికంఠ, డా.సుబ్బారెడ్డి, డా.సాయినాథ్, ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది స్వాతి, ఉస్మాన్ పాల్గొన్నారు.

## సత్తాచాటిన కృష్ణచైతన్య విద్యార్థులు

### మెగా జాబ్‌మేళాలో 201 మంది ఎంపిక



నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కాలేజీలో అక్టోబరు 5న జరిగిన మెగా జాబ్‌మేళాలో కృష్ణచైతన్య విద్యాసంస్థల్లో తృతీయ సంవత్సరం చదువుతున్నవిద్యార్థులు తమ ప్రతిభ నిరూపించుకుంటూ 201 మంది విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. ఐసిఐసిఐ కంపెనీ, శ్రీసిటీకి సంబంధించిన 9 హెచ్ సొల్యూషన్స్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయి. శ్రీసిటీకి చెందిన ఆర్‌ఎంపిసి కంపెనీలో 96 మంది, ఎల్‌ఇడీ టివి కంపెనీలో 46 మంది, ఐసిఐసిఐ కంపెనీలో 59 మంది విద్యార్థులు ఎంపిక కావడం తమకెంతో సంతోషంగా ఉందని కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్ ఎన్.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన స్పెషల్ బస్సులు

నెల్లూరు నుంచి విశాఖపట్నం, బెంగుళూరులకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు రోడ్డెక్కాయి. కోవిడ్ కారణంగా ఇటీవలి కాలంలో నిలిచిపోయిన వెన్నెల స్లీపర్‌సర్వీసును బెంగుళూరుకు, విశాఖపట్నానికి డాల్ఫిన్ క్రూయిజ్ సర్వీసును అక్టోబర్ 3 నుంచి తిరిగి పునరుద్ధరించారు. వెన్నెల బస్సు నెల్లూరు నుంచి బెంగుళూరుకు ప్రతిరోజు రాత్రి 9.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు వేకువన 5 గంటలకు బెంగుళూరుకు చేరుకుంటుందని, అది తిరిగి బెంగుళూరు నుంచి రాత్రి 9.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు వేకువన 5 గంటలకు నెల్లూరుకు వస్తుందని ఆర్టీసి డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలియజేశారు. అదేవిధంగా డాల్ఫిన్ క్రూయిజ్ బస్సు నెల్లూరులో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు విశాఖకు, అది తిరిగి విశాఖలో 7.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు నెల్లూరుకు వస్తుందని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో ప్రస్తుతం ఉన్న చార్జీల్లో 10 శాతం రాయితీ కూడా ఇస్తున్నామన్నారు.

### ప్లాస్టిక్‌ను వదిలేద్దాం..
## పర్యావరణం కాపాడుకుందాం



పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను వదిలేద్దామని, భావితరాలకు మంచి వాతావరణ అందించేందుకు ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటించాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 4న ఆయన నెల్లూరులోని విఆర్‌సి కూడలిలో 'క్లీన్ ఆంధ్రప్రదేశ్-క్లీన్ నెల్లూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రతను పాటించేందుకు, ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ప్రతిజ్ఞ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే ప్లాస్టిక్‌ను నిషేధించాలని సంకల్పిస్తే సరిపోదని, ప్రజలు కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే 50 కోట్ల రూపాయల వ్యయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి చెత్తను డంపింగ్ చేయాల్సిన పరిస్థితి లేకుండా చూస్తామన్నారు. శాసనమండలి ప్రొటెం స్పీకర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు ప్లాస్టిక్ నిషేధం చేపట్టడం అభినందనీయమని, ఇది పూర్తిస్థాయిలో అమలైతే భావితరాల వారికి మంచి చేసిన వారవుతారని అన్నారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన చెస్ పోటీలు



నెల్లూరులోని జీవిస్టార్ గార్డెన్స్‌లో ఈనెల 2 నుంచి మహాత్మాగాంధీజీ స్మారక చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను జేసీ హరేందిరప్రసాద్ ప్రారంభించి గాంధీజీ పేరుతో ఈ పోటీలను నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. ఏడు జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. చదరంగం క్రీడతో యువతో మేధోసంపత్తి పెరుగుతుందన్నారు. సెట్నెల్ సిఇఓ పుల్లయ్య, న్యాయవాది సుబ్బారెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యదర్శి సుమన్, ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజర్ విజయ్‌తో పాటు నిర్వాహకులు రామ్‌లక్ష్మణ్, వెంకటరమణ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని
## వాహనాలపై కేసులు



జిల్లా ఉప రవాణా కమిషనర్ చందర్ ఆదేశాలతో జిల్లా రవాణాశాఖ అధికారులు ఇటీవల జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. కావలి, వెంకటాచలం టోల్‌ప్లాజాల వద్ద నిర్వహించిన ఈ తనిఖీల్లో చెన్నై, హైదరాబాద్, బెంగుళూరులకు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులను తనిఖీ చేసి నిబంధనలు పాటించని 13 బస్సులు, పరిమితికి మించి సరుకులు తీసుకువెళ్తున్న మరో 3 లారీలపై కేసులు నమోదు చేశారు. వీటన్నిటికీ కలిపి 15 లక్షల రూపాయల దాకా అపరాధ రుసుం విధించారు.

# ఉద్యోగాలు సృష్టించే స్థాయికి యువత ఎదగాలి

- మంత్రి మేకపాటి గౌతంరెడ్డి





ఉద్యోగం చేయడం కాదు, ఉద్యోగాలు సృష్టించే స్థాయికి యువత ఎదగాలని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వెంకటేశ్వరపురం ఐ.టి.ఐ బాలుర క్యాంపస్‌లో ఈ నెల 4న నిర్వహించిన నేషనల్ అప్రెంటిస్షిప్ మేళా–2021 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కరోనా అనంతరం పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, అందకనుగుణంగా యువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఆశయాలే అభివృద్ధికి మెట్లని, ఆకాశమే హద్దుగా యువత ఆలోచనలు ఉండాలన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని క్రమశిక్షణతో కష్టపడినప్పుడు అనుకున్నది సాధ్యమౌతుందని మంత్రి తెలిపారు. యువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతి ఐ.టి.ఐ కళాశాలను స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు అనుసంధానం చేసి కొత్త సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో భాగంగా నెల్లూరు ఐటిఐ క్యాంపస్‌లో నైపుణ్య కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నైపుణ్యం అనేది ఉన్నప్పుడే ఉద్యోగ అవకాశాలు వచ్చే పరిస్థితి ఉందని, ఈ పరిస్థితుల్లో యువత తప్పనిసరిగా తమ తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న కొత్త పరిశ్రమల్లో 70శాతం ఉద్యోగాలు స్థానిక యువతకే ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకు రావడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ జాయింట్ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస మధు, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ, రైల్వే, షార్, నెల్‌క్యాస్ట్, ఫార్మా, అశోక్ లేల్యాండ్, శ్రీసిటీ, టివిఎస్ తదితర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, ఐటిఐ కోర్సు పూర్తి చేసుకున్న యువతీ యువకులు పాల్గొన్నారు.

### శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

# మొదలైన నవరాత్రి వేడుకలు





ఉత్సవాల వివరాలను వెల్లడిస్తున్న ఆలయ ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్


నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో కొలువైఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈసారి నవరాత్రి వేడుకలు మరింత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయం గౌరవాధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తుండడం విశేషం. అమ్మవారి దేవస్థానంలో ఇటీవల జరిగిన కుంభాభిషేకం తర్వాత ఇవి తొలి దసరా వేడుకలు కావడంతోఆ తొమ్మిది రోజులూ తొమ్మిది రకాల అలంకారాలతో, విశేష పూజలతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన ఆ వేడుక ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. 7వ తేదిన బాలా త్రిపురసుందరి అలంకారం, పసుపు కుంకుమలతో అమ్మవారిని అలంకరించి పెద్దఎత్తున పూజలు, 8న అన్నపూర్ణాదేవి అలంకారం, 9వ తేదీన శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారం నిర్వహించారు. మూల వర్లకు గాజుల అలంకారం చేశారు. ఈపుల 10న గాయత్రీదేవి అలంకారం, పూలంగిసేవ, 11న ధనలక్ష్మి అలంకారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వాసవిమాత ఆలయాల్లో రాష్ట్రంలో మునుపెన్నడూ ఎక్కడా జరగని విధంగా 5 కోట్ల రూపాయల కొత్త కరెన్సీనోట్లు సేకరించి ఆ నగదుతో అమ్మవారిని అలంకరించనున్నారు. 12న సరస్వతీదేవి అలంకారం, 13న దుర్గాదేవి, 14న గజలక్ష్మి అలంకారాలను భక్తిశ్రద్ధలతో చేపడతామని, ఆరోజున అమ్మవారికి 15న పులివాహనంపై అమ్మవారి నగరోత్సం నయనానందకరంగా ఉండేలా చేస్తామని చెప్పారు. 16న వసంతోత్సవం, దర్బార్ అలంకారం నేత్రపర్వంగా ఉంటుందన్నారు.




ఇటీవల నెల్లూరులోని తన నివాసంలో ఆత్మీయపూర్వకంగా కలిసిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ హేమ సుస్మితలకు శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజా ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించిన వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి




# శ్రీసిటీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు




శ్రీసిటీ ఖాతాలో మరో ప్రతిష్టాత్మక పురస్కారం చేరింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎమ్‌ఎఐ) వారి ' ఉత్తమ సిఎమ్ఎ–సి.ఎఫ్.ఓ అవార్డు' దక్కింది. ఐసిఎమ్ఎఐ 5వ సిఎమ్ఎ–సి.ఎఫ్.ఓ అవార్డు–2017 వర్చువల్ మోడ్ వేడుకలో శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సి.ఎఫ్.ఓ) ఆర్.నాగరాజన్‌కు అవార్డును అందచేశారు. కార్పొరేట్ పాలన, ఉత్తమ సీఎస్సార్ పద్ధతులను ప్రోత్సహించడం, తదితర మేలైన పద్ధతులను అమలు చేయడంలో సమర్థత, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నందుకు నాగరాజన్‌ను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. అవార్డు సాధించినందుకు చాలా సంతోషంగా ఉందన్న ఆయన, ఫైనాన్స్ రంగంలో ప్రతిభావంతులను గుర్తించి ఇలాంటి అవార్డు కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఐసిఎమ్ఎఐ కు అభినందనలు తెలిపారు. ఈ సంవత్సరంలో శ్రీసిటీకి ఇది 5వ అవార్డు కావడం తమకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు.

# స్ఫూర్తిప్రదాత.. స్వామి వివేకానంద

- శ్రీసిటీలో వివేకానంద కేంద్రం ప్రెసిడెంట్ బాలకృష్ణన్



కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రం ప్రెసిడెంట్ ఎ.బాల కృష్ణన్ ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, వెనుకబడిన ఈ ప్రాంతంలో శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం బాలకృష్ణన్ మాట్లాడుతూ, స్వామి వివేకానంద బోధనలను వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పారిశ్రామికవేత్తలు, సాధారణ వ్యక్తులు మరే ఇతర వృత్తుల వారైనా, మన అందరికీ స్వామి వివేకానంద ఒక ప్రేరణ, స్ఫూర్తిప్రదాత అని అభివర్ణించారు.

భారతదేశ స్వావలంబనపై వివేకానంద ఆలోచనలను వివరిస్తూ.. స్వావలంబనే మన లక్ష్యంగా స్వామి వివేకానంద బోధనలు చేశారన్నారు. దేశం స్వావలంబన సాధించేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

### తూపిలిపాళెం బీచ్‌లో..

# ఎన్‌సిసి క్యాడెట్ల స్వచ్ఛత సేవ




కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ కళాశాల విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు అక్టోబరు 2వ తేది గాంధీజయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. తూపిలిపాళెం సముద్రతీరంలో పర్యాటకులు పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచి తమ సేవాభావం చాటుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నాలుగు కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సముద్రజలాలు కలుషితమవుతున్నాయని, దాంతో సముద్రంలో ఉన్న అనేక జీవరాశుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పారేయవద్దని కోరారు. ఎన్‌సిసి అధికారి లెఫ్ట్‌నెంట్ మాధవయ్యతో పాటు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు

# వైసీపీని ఎలా ఓడిస్తారు బాబూ!

రాష్ట్రంలో ఇప్పుడు వైసీపీ వ్యతిరేక ఓటు మూడు రకాలుగా చీలి ఉన్నది. ఒక ముక్కకు టీడీపీ, ఇంకో ముక్కకు జనసేన, మరో ముక్కకు బీజేపీ సారథ్యం వహిస్తు న్నాయి. వైసీపీకి దృఢమైన నాయకత్వం ఉంది. అది తిరుగులేని అధికారంలో ఉంది. చూసి రమ్మంటే, ఏకంగా కాల్చేసి వచ్చే అపార అనుచరగణం ఉంది. ఆసియా ఖండంలోనే మొదటి రెండు స్థానాలలో ఉన్న అంబానీ, అదాని ఆర్థిక సామ్రాజ్యాలు వైసీపీకి అండగా ఉన్నాయి. పక్కనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఆశీస్సులు ఉన్నాయి.



వీటికి తోడు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కాగూడదనే కేంద్ర ప్రభుత్వ పాలకుల దృఢ సంకల్పం అయాచితంగా వైసీపీకి తోడుగా ఉంది. ఇన్ని అనుకూలతలతో ధగధగలాడిపోతున్న వైసీపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటు మూడు భాగాలుగా చీలిపోతే 2024 అసెంబ్లీ ఫలితాలు 2019 అసెంబ్లీ ఫలితాలకంటే పెద్ద భిన్నంగా ఎలా ఉంటాయో అర్థం చేసుకోవడం కష్టం. ప్రతిపక్షంలో ఉండీ అధికారంలో ఉన్న టీడీపీని అవలీలగా ఓడించగలిగిన వైసీపీ, ఇప్పుడు అధికారంలో ఉంటూ టీడీపీని ఓడించడానికి మామూలుగా అయితే 'అదనపు' శ్రమ ఏమీ పడవలసిన పని లేదు. 2019లో 151 స్థానాలను కైవసం చేసుకోడానికి ఏ ఏ పద్ధతులను ఎంత విజయవంతంగా అవలంబించిందో... వాటిని మరింత పకడ్బందీగా అవలంబించగల స్థితిలోనే ఇప్పుడూ వైసీపీ ఉంది. 2019 నాటి సానుకూల పరిస్థితులను మించిన సానుకూలత ఇప్పుడూ ఉన్నది. అప్పుడు అంబానీ, అదానీ లేరు. ఇప్పుడు ఉన్నారు. అప్పుడు పోలీసు వ్యవస్థ సహకారం లేదు. ఇప్పుడు ఉన్నది.






జగన్ ప్రభుత్వం వ్యవహారశైలిపై ప్రజలలో అసంతృప్తి లేదని కాదు. గట్టిగా ఉన్నది. ఒకల్ సెక్షన్స్‌లో అయితే చాలా గట్టిగా ఉన్నది. ఆడ వాళ్లు సైతం బూతులు..., పచ్చి బూతులు మాట్లాడుతున్న వీడియోలు యూట్యూబ్‌లో సాక్షాత్కరిస్తున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో జగన్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్న వీడియోలకు లెక్కే లేదు. స్వైరవిహారం చేస్తున్నాయి. పోలీస్ యంత్రాంగాన్ని తన ప్రత్యర్థులపైకి వైసీపీ ప్రభుత్వం ఉసి గొల్పుతున్నదంటూ వైసీపీ రాజకీయ ప్రత్యర్థులు గగ్గోలు, శాపనార్థాలూ పెడుతున్నమాట కూడా నిజం. నగదు బదిలీ పథకాలను నిరంతరం కొనసాగించడం వల్ల ప్రభుత్వ సాధారణ నిర్వహణ రోజురోజుకూ క్లిష్టమైపోతున్నదనే భావన పొగ మంచులా రాష్ట్రాన్ని దట్టంగా ఆవరించేసిన మాట కూడా నిజం. ఇన్ని ప్రతికూలతల మధ్య వైసీపీ, 2024లో మళ్లీ ఎలా నెగ్గుకు వస్తుందనే సందేహం రావడం ఎవరికైనా సహజమే.

అయితే, మూడు, నాలుగు ముక్కలుగా చీలి ఉన్న ప్రతిపక్షం 2024లో వైసీపీని ఓడించగలదా? టీడీపీ-జనసేన- బీజేపీ "ఒకే మాట – ఒకే బాట" మీదకు రాకుండా వైసీపీని ఎదిరించ గలగడం సాధ్యమా? వైసీపీ అభ్యర్థిని ఎదిరించి తట్టుకోగలిగిన అభ్యర్థులు 175 నియోజకవర్గాలలోనూ ప్రతిపక్షానికి అసలు లభిస్తారా?

వైసీపీని ఓడించడానికి ప్రతిపక్షం చేతిలో ఉన్న 'అస్త్రం' ఏమిటి? ఇప్పటికైతే ఏమీ లేదు. పవన్‌కళ్యాణ్ వాగాడంబరత వల్ల ఓట్లు కురవవు. చంద్రబాబు ప్రెస్‌మీట్లు, లోకేష్ ట్వీట్లు, టీడీపీ నేతల విమర్శలవల్ల పని జర గదు. అయోధ్యలోని రాములవారు ఆంధ్రలో బీజేపీని పట్టించుకునే పరిస్థితి లేదు. మిగిలిన దేవుళ్ళు కూడా సోము వీర్రాజు వంక కన్నెత్తయినా చూడడం లేదు. అయినా, 2024లో వైసీపీని ఓడించగలమనే ఆశ ఏదో... టీడీపీలో మిణుకు మిణుకు మంటున్నది. జగన్‌పై ఉన్న సీబీఐ కేసులలో ఏదో ఒకటి పలకమారి, పండి, న్యాయవ్యవస్థ అనే చెట్టుమీద నుంచి రాలి, తమ ఒళ్ళో పడకపోద్దా అనే ఆశలో ప్రతిపక్షం ఉంది. అయితే, కావచ్చేమో గానీ... 2024 ఎన్నిక లకు జగన్ భౌతికంగా అందుబాటులో లేని పరిస్థితి గనుక ఎదురైతే.. వైసీపీని అది మరింత బలోపేతం చేస్తుంది. 2019 ఎన్నికల నాటి సానుకూల పరిస్థితులు వైసీపీకి ద్విగుణీకృత మవుతాయి. వైసీపీ విశ్వరూపాన్ని ప్రతిపక్షం చూస్తుంది.

వైసీపీకి ఉన్న ఈ సవాలక్ష సానుకూలతలను మించి, దాని వ్యతిరేక ఓటును ఏకోన్ముఖం చేయగలిగిన సత్తా ప్రతిపక్షానికి ఉంటుందా?

2024 ఎన్నికలకు సంబంధించి చంద్రబాబు ముందు రెండు ప్రత్యామ్నాయ ప్రాధాన్యతలు ఉన్నాయి.

1. ఆరు నూరైనా సరే, 2024లో వైసీపీ తిరిగి అధికారంలోకి రాకుండా నిరోధించడం. 2. ఆరు నూరైనా సరే, 2024లో తాను ముఖ్యమంత్రి కావడం.

ఈ రెండు ప్రాధామ్యాలు ఒకటిలాగానే పైకి కనపడుతున్నప్పటికీ, కార్యాచరణలో చాలా తేడా ఉంది. ఏ ప్రాధామ్యాన్ని తెలుగు దేశం అధ్యక్షుడు ఎంచుకుంటారు అనే అంశంపై తెలుగుదేశం నడక ఆధారపడి ఉంటుంది. దీనికి 'భావో ద్వేగ' అంశం తోడు కావాలి. వైసీపీ సానుకూలతలను అధిగమించగలిగిన 'భావోద్వేగ' అంశాన్ని కూడా చంద్రబాబు తెరపైకి తీసుకురాగలగాలి.

అప్పుడు మాత్రమే, 2024లో వైసీపీని ప్రతిపక్షాలు నిలువరించగలుగుతాయనే నమ్మకానికి కొంత పునాది ఏర్పడుతుంది.. అంతే తప్ప 'అప్పో...బావా' రాజకీయాలు వైసీపీ ముందు పనిచేయవు.

చూద్దాం! తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో... టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎటువంటి ప్రాధామ్యత మార్గాన్ని ఎంపిక చేసుకుని, ఎంతటి బలమైన 'భావోద్వేగ' అంశాన్ని ఎన్నికల అస్త్రంగా తెరపైకి తీసుకు రాగలుగుతారనే దానిపైనే 2024 ఎన్నికలు... ఏకపక్షమా–కాదా అనే విషయం ఆధారపడి ఉంటుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# సమైక్యతకు ప్రతీకగా.. గూడూరు 'జెండా పండుగ'

గూడూరులో 'జెండా పండుగ'కు గొప్ప పేరు. భక్తులంతా కలసి శ్రీ ఆంజనేయస్వామి చిత్రపటాన్ని జెండాగా చేసుకుని ఈ పండుగను ఎంతో వేడుకగా నిర్వహిస్తుంటారు. దేవీనవరాత్రి ఉత్సవాలకు ఒకరోజు ముందునుంచే ఈ జెండా పండుగ ఉత్సవాలు అంగరంగవైభవంగా చేప ట్టడం గూడూరులో దాదాపు 76 ఏళ్ళ నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ ఏడాది కూడా కరోనా నేపథ్యంలో ఈ వేడుకలను ఈనెల6న సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అయితే, మునుపటి ఉత్సాహం ఈసారి కనిపించకపోవడంతో జెండా పండుగా నిరాడంబరంగానే జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్క గూడూరులో మాత్రమే ఇన్నేళ్ళుగా శ్రీ ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు జరుగుతుండడం విశేషం. అందుకు ఆసక్తికరమైన స్థానిక కథనాలు ఉన్నాయి. గూడూరు పట్టణం ఏర్పడిన తొలినాళ్ళలో 1945 ప్రాంతాల్లో పట్టణంలో వ్యాధులు, అరిష్టాలు, దుష్టగ్రహ దోషాలు పెరిగిపోతుండడంతో శ్రీ ఆంజనేయస్వామిని పూజిస్తే దోషాలు తొలగిపోతాయని పెద్దలు నిర్ణయించుకున్నారు. ఆరు గజాల తెల్లని వస్త్రంపై.. సంజీవని పర్వతంతో భూమిపై కాలుమోపుతున్న భంగిమలో శ్రీ ఆంజనేయస్వామిని చిత్రించి వెదురుకర్రకు కట్టి జెండాగా చేసుకుని మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని బొడ్డురాయి వద్ద ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించారు. దీంతో వ్యాధులు తగ్గిపోవడంతో ప్రజలను శ్రీ ఆంజనేయ స్వామి సంజీవని తెచ్చి కాపాడాదని గూడూరు ప్రజలు నమ్మడంతో.. ఆనాటి నుండి శ్రీ ఆంజ నేయస్వామి జెండా పండుగను ఘనంగా నిర్వహించడం ప్రారం భించారు. నాటినుంచి ఈ పండుగను అందరూ కలిసి సమైక్యంగా ప్రతి ఏటా ఉత్సాహంగా జరుపుకుంటుండడం, ఈ జెండా పండుగ గూడూరులో ఒక సంప్రదాయంగా మారడం విశేషం.



# గూడూరు డివిజన్ వార్తలు

## సమస్యల పరిష్కారానికి చర్యలు



గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ ఈ నెల 4వ తేదీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ప్రజల సమస్యలపై ఆయా ప్రాంతాలలోని రెవెన్యూ అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

## త్వరలో ఇళ్ళు కట్టుకోండి

**- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్**



గూడూరు గాంధీనగర్‌లో ఉన్న లే అవుట్‌లో ఎవరికైతే ఇళ్లస్థలాలు ఇచ్చారో వాళ్లు త్వరగా ఇళ్ళు నిర్మించుకోవాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ కోరారు. ఇటీవల గూడూరు పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైతే ఇల్లు కట్టుకోవాలని అనుకుంటున్నారో వాళ్లకి ప్రభుత్వం నుండి నాలుగు ట్రాక్టర్ల ఇసుక, 90 బస్తాలు సిమెంట్ అందించనున్నామన్నారు. ఒక బస్తా సిమెంట్ 230 రూపాయలకే ప్రభుత్వం అందించనుందని, ఈ విషయాలను లబ్దిదారులకు తెలియజేసి వారు ఇళ్ళు నిర్మించుకునేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన వలంటీర్లకు సూచించారు.

## దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు




ఈ నెల 5వ తేదీ గూడూరు, త్యాగరాజా వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవ స్థానంలో "రెడ్" సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ మరియు ఆంధ్రమహిళా మండలి సహకారంతో 35 మంది పేద దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కీ॥శే॥ గోకర్ణం మునికృష్ణయ్య జ్ఞాపకార్థం కోడలు–కుమారుడు జయజ్యోతి– మునీంద్ర 5000 రూపాయలు అందజేసి ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి కొణిదల అనిత, జీవనిరెడ్డి, జయజ్యోతి, "రెడ్ సంస్థ" ప్రెసిడెంట్ జానా సుధీర్, శ్రీనివాసాచారి, పల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ముస్లిం వెల్ఫేర్ దుప్పట్ల పంపిణీ




గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని హజరత్ సయ్యద్ హాషిం హుస్సేనీ బాబా దర్గా నందు 100 మంది నిరుపేదలకు రాబోయే చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ మాట్లా డుతూ దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులందరి అభిప్రాయం మేరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేశామని తెలిపారు. దర్గా కమిటీ గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ చలి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా సంస్థ సభ్యులందరికి ధన్యవాదాలు తెలియజేసారు. దర్గా ముజావర్ మగ్దుమ్, అబ్దుల్ రహీం, కాలేషా, రవూఫ్, దర్గా కమిటీ సభ్యులు మెట్రో రెహ్మాన్,గోల్డెన్ గౌస్, కరిముల్లా, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యసేవల్లో బెస్ట్.. జొన్నవాడ పీహెచ్‌సి




- **జాతీయ అవార్డు సాధించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం**

నాణ్యమైన వైద్యసేవలందించడంలో జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సి) జాతీయ అవార్డును సాధించి జిల్లా వైద్యశాఖకు మంచిపేరు తెచ్చిపెట్టింది. కేంద్రంలోని జాతీయ నాణ్యతా విలువల కమిటీ ఆన్‌లైన్ ద్వారా ఈ పీహెచ్‌సిని పరిశీలించి ఈ అవార్డును ప్రకటించింది. ఆసుపత్రి వైద్యులు శ్రీతేజ, ఆరోగ్య సిబ్బంది సహకారంతో ఈ అవార్డు వచ్చినట్లు డాక్టర్ నస్రీన్‌బాను, ఖాదర్‌లు తెలిపారు. ఈ సమాచారం తెలియగానే వవ్వేరు సహకారబ్యాంకు ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ హమీద్, ఎంపిడిఓ నరసింహారావు తదితరులు ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని అభినందించారు.

# ఖైదీలు సత్ప్రవర్తనతో జీవించాలి

**లీగల్‌సెల్ అథారిటీ ఛైర్మెన్ పి.పాండురంగారెడ్డి**

ఖైదీలు తాము చేసిన నేరాల పట్ల పరివర్తన చెంది సత్ప్రవర్తనతో జీవించాలని కావలి సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్‌సెల్ అథారిటీ ఛైర్మెన్ పి.పాండురంగారెడ్డి ఆకాంక్షించారు. అక్టోబరు 2న గాంధీజయంతి సందర్భంగా కావలి సబ్‌జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవల పట్ల అందరూ అవగాహన పొందేందుకు దేశవ్యాప్తంగా అక్టోబరు 2 నుంచి 14వ తేది వరకు చైతన్య కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. క్షణికావేశంలో చేసిన నేరాల వల్ల వారి కుటుంబాలవారు రోడ్డు పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖైదీలు మానసిక పరివర్తనతో మంచిగా మెలగాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్రబాబు, లోక్‌అదాలత్ సభ్యులు కెనడీ, శ్రీదేవి, న్యాయవాదులు సాయిప్రసాద్, రామిరెడ్డి, బాలాజీ, జైలు సూపరింటెండెంట్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌కే కళ తెచ్చిన గాంధీజీ విగ్రహం

**- ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించిన కలెక్టర్**

ఈసారి గాంధీజయంతికి నెల్లూరు కలెక్టరేట్‌లో కొత్తగా మహాత్మాగాంధీ విగ్రహాన్ని నెలకొల్పి అందరిలో ఆ మహాత్ముని జ్ఞాపకాలను మరోసారి గుర్తుకుతెస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు స్ఫూర్తిదాయకమైన మంచి కార్యక్రమాన్ని నిర్వహించి అందరి అభినందనలు అందుకున్నారు. కలెక్టరేట్‌కే కళ తెచ్చిన మహాత్ముని విగ్రహాన్ని సందర్శించిన వారంతా ఎంతో సంతోషించారు. అక్టోబర్ 2 గాంధీజయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట సుందరంగా తీర్చిదిద్దిన బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిపాలనకు కేంద్రబిందువుగా ఉన్న నెల్లూరు కలెక్టరేట్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన శాంతిదూత, జాతిపిత మహాత్మాగాంధీజీ తన జీవితాన్నే ఒక సందేశంగా దేశప్రజలకు అందజేశారని కొనియాడారు. బాపూజీ ఉపదేశించిన శాంతి, అహింస మార్గాలను అందరూ తమ జీవితాల్లో ఆచరించి గాంధీజీ ఆశయాల బాటలో అందరూ నడవాలని ఆయన ఆకాంక్షించారు. దేశానికి ఎనలేని సేవలందించి మార్గదర్శకులైన బాపూజీ, అక్టోబర్ 2వ తేదీనే జన్మించిన లాల్‌బహదూర్‌శాస్త్రిల సేవలను ఆయన అందరికీ గుర్తుచేశారు. వారితోతో పాటు దేశ విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర్యసమర యోధులను ఏనాటికీ విస్మరించరాదన్నారు. తొలుత ఆయన గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం




నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి గాంధీజీ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్‌ఖరే, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, డిఆర్ఓ చిన్నఓబులేసు, డిపిఓ ధనలక్ష్మి, సాంఘికసంక్షేమశాఖ డి.డి జీవపుత్రకుమార్, నీటిపారుదలశాఖ ఎస్ఇ కృష్ణమోహన్, పౌరసరఫరాలశాఖ డి.డి వెంకటేశ్వర్లప్రసాద్ లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వైద్యసిబ్బందికి

# మాస్కులు, శానిటైజర్లు పంపిణీ

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న లైఫ్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండాపురంలోని వైద్యసిబ్బందికి శానిటైజర్లు, మాస్కులు పంపిణీచేసి నిర్వాహకులు తమ సేవాభావం చాటుకున్నారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ మాలకొండారెడ్డి, కొండాపురం వైద్యాధికారి వినోద్‌కుమార్‌లతో పాటు ఆర్ఎంపి అసోసియేషన్ నాయకుడు గోవింద్, సాయిపేట జడ్పీ హైస్కూలు ఛైర్మెన్ శ్రీనివాసులు, వైద్యులు అంకయ్యచౌదరి, కృష్ణమోహన్, సిహెచ్ఓ చెంచురామయ్య, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## పెంచలస్వామికి కనువిందుగా..

# కల్యాణోత్సవం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో అక్టోబర్ 2న ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి నిత్యకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేక సేవ నిర్వహించి పూజలు చేసిన అనంతరం, స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణమండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య, మేళతాళాల మధ్య వేదపండితులు స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, ఆలయ సిబ్బంది ఈ వేడుకను పర్యవేక్షించారు. భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామివార్లను దర్శించుకున్నారు.

# మహాశక్తి స్వరూపిణి.. తోడేరు మహంకాళి అమ్మవారు

*ఈ సకల చరాచర విశ్వానికంతటికీ సృష్టికర్త.. ఆ జగన్మాత దుర్గాదేవి. అండపిండ బ్రహ్మాండమంతా ఆమె సృష్టే. అమ్మవారు త్రిశక్తి స్వరూపిణి. దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించే ఆదిపరాశక్తిగా జగదంబ ప్రసిద్ధి. ఆ మహాశక్తే సర్వాంతర్యామి. అందుకే భారతావని అంతా అమ్మవారి ఆలయాలున్నాయి. అనేక ప్రసిద్ధమైన దేవాలయాలతో పాటు గ్రామగ్రామానా అమ్మవారికి గుళ్ళు గోపురాలున్నాయి. రూపాలేవైనా, పేర్లు ఏవైనా.. అన్నీ ఆ మహాశక్తి స్వరూపిణి అంశలే. నెల్లూరుజిల్లా తోడేరు గ్రామంలో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం కూడా ఆ కోవలోదే. తోడేరు గ్రామదేవతగా నేటికీ అందరి పూజలందుకుంటున్న శ్రీ మహంకాళి అమ్మవారిని కొలుచుకుంటే అన్ని కష్టాలు తొలగిపోతాయని ప్రతీతి. భక్తులకు కొంగుబంగారంగా తోడేరులో ఎంతో పురాతన కాలం నుంచి వెలసివున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన పలు కథనాలు కూడా వినవస్తున్నాయి.*

నెల్లూరు జిల్లాలో మండల కేంద్రమైన పొదలకూరు మంచి కూడలి ప్రాంతం. జిల్లా కేంద్రమైన నెల్లూరుకు, అటు గూడూరు, రాపూరు, కలువాయి, సోమశిల తదితర ప్రాంతాలకు వెళ్ళేందుకు పొదలకూరు అనువైన కూడలి కావడంతో ఈ చుట్టుపక్కల ఊళ్ళన్నీ బాగానే అభివృద్ధి చెందుతున్నాయి. పొదలకూరుకు కేవలం అయిదు కిలోమీటర్ల దూరంలోనే తోడేరు గ్రామం ఉంది. గ్రామస్తుల ఇలవేల్పుగా అనాదిగా పూజలందుకుంటున్న గ్రామశక్తి.. శ్రీ మహంకాళి అమ్మవారు. జిల్లాలోని శక్తివంతమైన ఆలయాల్లో శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం ఒకటి. ఈ ఆలయం ఎంతో పురాతన కాలం నుంచి ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఊరు పుట్టినప్పటినుంచి ఈ ఆలయం ఉందని పెద్దలు చెప్తుంటారు. అయితే ఊరికి దూరంగా, స్మశానానికి దగ్గరగా ఉన్న ఆ ప్రాంతానికి వెళ్ళాలంటే పూర్వకాలంలో





మన దేవాలయాలు (68)

ప్రజలు కొంత తటపటాయిస్తుండేవారట. దీంతో క్రమేణా ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్తకు చేరుకుంది. ఆ తర్వాత సుమారు రెండువందల సంవత్సరాల క్రితం ఉన్నట్లుండి తోడేరులో అంటువ్యాధులు ప్రబలడం అనేకమంది మరణిస్తుండడంతో ప్రజలంతా ఆవేదన చెందుతున్న తరుణంలో తోడేరులోని గ్రామపెద్దకు ఓసారి అమ్మవారు స్వప్నదర్శనమిచ్చి 'నన్ను కొలిస్తే ఎలాంటి సమస్యలు ఉండవు కదా' అని చెప్పిందట. దీంతో మెలకువ వచ్చిన ఆ గ్రామపెద్ద తెల్లవారగానే ఆ విషయాన్ని గ్రామస్తులందరికీ చెప్పడంతో అందరూ కలసి ఆలయానికి వెళ్ళి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని పూజలు చేయడం ప్రారంభించారని చెప్తుంటారు. దీంతో క్రమేణా గ్రామంలో వ్యాధులు మాయం అయ్యాయట. అంతేకాదు అమ్మవారి అనుగ్రహంతో గతంలో కంటే బాగా వర్షాలు పడి సకాలంలో పంటలు పండుతూ గ్రామమంతా సుభిక్షంగా ఉండడంతో గ్రామస్తులు ప్రతిరోజూ పూజలు చేయడం ప్రారంభించారు. అలా ప్రారంభమైన పూజలు సేవలు నేటికీ నిర్విఘ్నంగా.. ఎంతో వైభవంగా జరుగుతూనే ఉన్నాయి కూడా.

**సర్వాంగ సుందరంగా ఆలయం :**

ఒకప్పట్లో అమ్మవారి ఆలయం పూర్తిగా శిథిలావస్తలో ఉండేది. ఎప్పుడో వేదకాలంలో మహంకాళీ అమ్మవారి స్తోత్రాల్లో అమ్మవారు 'స్మశానాలయ వాసినీమ్' అన్నట్లుగానే ఇక్కడ ఈ ఆలయం స్మశానానికి చేరువలోనే ఉండడం విశేషం. దుష్ట సంహారిణి, శిష్ట సంరక్షణి అయిన మహంకాళీ అమ్మవారిని పూజించుకుంటే సకల భయాలు తొలగిపోయి, సకల శుభాలు కలుగుతుండడంతో ప్రజల్లో అమ్మవారిపట్ల భక్తి బాగా ఏర్పడింది. గత కొంతకాలంగా దాతలు, స్థానిక ప్రముఖులు, ప్రజలు అంతా కలసి అమ్మవారి ఆలయాన్ని పునరుద్ధరించారు. మరమ్మతులు పూర్తిచేసి రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

**నిత్యపూజలతో కళకళ :**

ప్రతి ఆదివారం అభిషేకాలు, భజనలతో పాటు నిత్యం అమ్మవారికి పూజలు చేస్తుండడంతో భక్తుల రాకపోకలతో అమ్మవారి ఆలయం కళకళలాడుతోంది. గ్రామం ప్రశాంతంగా సుభిక్షంగా ఉండాలన్నా, వ్యాధుల బాధలు పోవాలన్నా, పంటలకు చీడపీడలు రాకుండా ఉండాలన్నా, ప్రజలకు కోరిన కోర్కెలు తీరాలన్నా, ఆరోగ్య సౌభాగ్యాలు కావాలన్నా, ఆపదలు తొలగిపోవాలన్నా.. దేనికైనా సరే అమ్మవారి కృప ఉంటే చాలు.. అన్ని కష్టాలు తీరిపోతాయని ప్రజలు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు. అనేకమంది గ్రామస్తులు, భక్తులు అమ్మవారిని నిత్యం తమ ఆరాధ్యదైవంగా ఆరాధిస్తూనే ఉన్నారు. స్థానిక ప్రజలు, భక్తులు, దాతలందరి సహకారంతో చుట్టూ సుప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి ఆలయం ఇటీవలి కాలంలో బాగా అభివృద్ధి చెందుతూ దేదీప్యమానంగా వెలుగొందుతోంది.



# ఆలయాలకు నవరాత్రి శోభ



## విద్యుద్దీపకాంతులతో కళకళ... సర్వత్రా దసరా సందడి

దసరా సందడి ప్రారంభం కావడంతో జిల్లావ్యాప్తంగా ఆలయాలు నవరాత్రి శోభతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో నవరాత్రుల పూజలు, అలంకారాలు శోభాయమానంగా ఉంటున్నాయి. ఈనెల 7 నుంచి 15వ తేది దాకా నవరాత్రి వేడుకలు నిర్వహించేందుకు అనేక ఆలయాల్లో ఏర్పాట్లు భారీగానే జరిగాయి. కానీ కోవిడ్ నేపథ్యంలో ఈ ఉత్సవాల్లో మునుపటిలా సంబరాలు లేవు. ఏకాంతంగా పూజలు చేయడం, కోవిడ్ నిబంధనలు పాటించడం ముఖ్యం కనుక గతంలో వలె భారీగా ఉత్సవాలు జరగడం లేదు. అనేక ఆలయాల్లో ఈనెల 7వ తేదీన కలశస్థాపనతో నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. 7 నుంచి 15 దాకా వరుసగా తొమ్మిది రోజులూ ఒక్కోరోజు ఒక్కో అలంకారం చేసి అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. చండీ అలంకారం, భవాని, గాయత్రి, గజలక్ష్మి, కాళికాదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్ధిని, శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాలతో అమ్మవారిని దేదీప్యమానంగా అలంకరించి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఈ నెల 15న 'విజయదశమి' కనుక మరింత వైభవంగా ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవారికి విశేషపూజలు జరుగుతాయి. నవావరణ పూజలు, శ్రీచక్ర పూజలు, దేవిసప్తశతి పారాయణాలు.. అమ్మవారికి పూల పల్లకీ సేవలు, పుష్పాలంకరణలు నయనందకరంగా నిర్వహిస్తున్నారు.



విద్యుద్దీప కాంతులతో కళకళలాడుతున్న సూళ్ళూరుపేట చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయం



పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవికి సౌభాగ్యలక్ష్మి అలంకరం

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ప్రముఖమైన ఆలయాలన్నీ నవరాత్రి శోభతో, విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతున్నాయి. జొన్నవాడలోని కామాక్షమ్మ అమ్మవారి దేవాలయం, పెంచలకోన లక్ష్మీనృసింహాలయం, వేదగిరిలోని నరసింహస్వామి దేవస్థానం, సూళ్ళూరుపేట చెంగాళమ్మ, వరిగొండ జ్వాలాముఖి దేవి, కావలి కలుగోళమ్మ అమ్మవార్ల ఆలయాలు అన్నీ నవరాత్రి ఉత్సవాల వేడుకలతో సందడిగా ఉన్నాయి. నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాధస్వామి దేవాలయం. మూలపేటలో ఉన్న భువనేశ్వరి దేవి సమేత శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, నెల్లూరు చెరువుగట్టున వెలసివున్న నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం తదితర ఆలయాల్లో నవరాత్రి వేడుకలు జరుగుతున్నాయి. అయితే కరోనా నేపథ్యంలో గత ఏడాది, ఈఏడాది కూడా అనుమతులున్న మేరకే ఉత్సవాలు పరిమితంగా నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు, భక్తులు అంతా మాస్కులు ధరించి ఆలయాలకు వస్తున్నారు.

# మృత్యు విలాసం... 'పక్షి'..విలాపం!



- ప్రాణాలు కోల్పోయిన 'దేవతా పక్షులు'
- 39 పెలికాన్‌లు మృత్యువాత!
- కలుషిత నీరే కారణమా?...
- ఆరా తీస్తున్న అధికారులు

*గతంలో ఎప్పుడూ లేనిది..పులికాట్ ప్రాంతానికి ప్రతి ఏటా వచ్చే విదేశీ విహంగాల్లో 39 పెలికాన్ పక్షులు ఒకేసారి మృత్యువాత పడడం స్థానిక ప్రజలకు, పర్యాటకులకే కాక జిల్లావాసులందరికి ఆవేదన కలిగిస్తోంది. ఎక్కడ పుట్టాయో ఏమో!..వేలాది మైళ్ళ దూరం నుంచి..దూరదేశాల నుంచి కొండలు..సముద్రాలు అన్నిటినీ దాటుకుని.. రెండు రెక్కలూ ఎగరేసుకుంటూ ఇక్కడికి వచ్చి..తమ సోయగాలతో అందరినీ అలరించే విదేశీ విహంగాలు ఆకస్మికంగా ఇలా మృత్యువాతపడడం పక్షిప్రేమికులను ఆవేదనకు గురిచేస్తోంది. పక్షులను దేవతలుగా భావించే ఆ చుట్టుపక్కల పల్లెప్రజల హృదయాలను మరింతగా కలచివేస్తోంది. అనేక సంవత్సరాలుగా ఈ పక్షులు ప్రతి ఏటా ఇక్కడికి వస్తున్నా ఎప్పుడూ ఇలాంటి దురదృష్టకర ఘటన జరగలేదు. ఒకవేళ కలుషిత నీటి వల్ల ఈ పక్షులు మృతిచెందాయా?..లేదా ఇంకేమైనా కారణాలున్నాయా?..అనేది రేపోమాపో నిపుణుల పరిశీలనలో తేలాల్సి ఉంది.*

జిల్లాలోని తడ మండలంలో ఉన్న కారిజాత చెరువులో విదేశీ వలసపక్షులైన పెలికాన్ (గూడ బాతులు)లు కొన్ని చనిపోయి ఉండడాన్ని ఇటీవల స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారమివ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పులికాట్ వన్యప్రాణి అధికారులు వచ్చి మృతిచెందివున్న ఆ పక్షులను పరిశీలించారు. కొన్ని చనిపోయి నీళ్ళపైనే తేలాడుతుండగా, మరికొన్ని నీటమునిగిపోయి ఉన్నాయి. వాటిని వెలికితీసి అధికారులు పరీక్షించారు. 39 పక్షుల దాకా మృతిచెంది ఉండడంతో అవి ఎందుకు చనిపోయాయో పరిశీలిస్తున్నారు.

### పక్షుల మరణంపై.. ముమ్మర పరిశీలనలు :

ఇప్పటికే అటవీశాఖ అధికారులు, నీటిపారుదల శాఖ వారు, వెటర్నరీ వారు, కాలుష్య నియంత్రణ మండలి వారు వచ్చి కారిజాత చెరువును పరిశీలించారు. అక్కడ నీళ్ళు కలుషితం అవుతున్నాయా?.. ఇంతకాలంగా లేనిది ఇప్పుడే ఎందుకు కలుషితమవుతున్నాయి?.. పక్షుల మరణానికి ఇదే కారణమా?.లేక మరేమైనా సంగతులున్నాయా?..అని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కారిజాత చెరువులో కొన్ని చేపలు కూడా చనిపోయి ఉండడంతో కలుషిత జలాల వల్లనే పక్షులు కూడా మరణించి ఉండవచ్చని కూడా అంటున్నారు. ఈనెల 5న కూడా అధికారులు మరోసారి వచ్చి కారిజాత చెరువును పరిశీలించారు.

### దూర దేశాల నుంచి వచ్చే.. అందాల పెలికాన్‌లు...



ప్రతిఏటా సైబీరియా, శ్రీలంక తదితర దేశాల నుంచి పెలికాన్ పక్షులు పులికాట్ సరస్సు ప్రాంతానికి వస్తుంటాయి. ఇంకా అనేక దేశాల నుంచి ఎన్నోరకాల పక్షులు ఇక్కడికి వచ్చి ఇక్కడే ఉంటూ, ఆహారం తింటూ, ఇక్కడే గుడ్లు పెట్టి పిల్లల్ని చేసి, వాటికి రెక్క లొచ్చేదాకా ఇక్కడే ఉండి తమ పిల్లలతో కలసి మళ్ళీ హాయిగా స్వస్థానాలకు ఎగిరిపోతుంటాయి. ఎన్నో ఏళ్ళ నుంచి ఇలా జరుగుతూనే ఉంది. ప్రతి ఏటా క్రమం తప్పకుండా పులికాట్, నేలపట్టు ప్రాంతాలకు వచ్చే ఈ అందాల పక్షులను ఇక్కడి గ్రామాల్లో ఉండే ప్రజలంతా 'దేవతా పక్షులు'గా భావిస్తారు. ఎప్పుడూ వాటికి ఎవరూ ఎలాంటి హానీ తలపెట్టరు. అలాంటిది ఒకేసారి 39 పెలికాన్ పక్షులు చనిపోయాయనే సమాచారంతో ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిర్ఘాంతపోతున్నారు. పులికాట్ తీరంలో ఒక్కపక్షికి ఇబ్బంది కలిగిందని తెలిసినా అందరూ తీవ్రంగా పరిగణించేవారు. ఎవరూ వాటిమీద రాళ్ళు విసరడం కానీ, వాటికి హాని తలపెట్టడం కానీ చేసేవారు కాదు. అలా చేయడం పెద్ద నేరం కూడా. వన్యప్రాణుల సంరక్షణకు, పక్షుల రక్షణకు గట్టి చట్టాలే ఉన్నాయి. పక్షుల రక్షణ కోసం తీసుకున్న కొన్ని చర్యల్లో భాగంగా పలు గ్రామాల్లో నేటికీ చాలా కాలం విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదు. రోడ్లుంటే వాహనాల రాకపోకలు, శబ్దాలతో పక్షులకు ఇబ్బందికరమని నేటికీ కొన్ని గ్రామాల్లో రోడ్లు కూడా పాత కాలంలో ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి. చుట్టుపక్కలున్న అనేక గ్రామాల్లోని ప్రజలు వాటిని దేవతా పక్షులుగా అభిమానించి ఆరాధించడం ఏళ్ళ తరబడిగా జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పెలికాన్‌లు పదుల సంఖ్యలో మృతిచెందడం ప్రజలను విస్తుపోయేలా చేస్తోంది. ఒక్క పక్షికి హాని జరిగితేనే కఠినచర్యలకు ఉపక్రమించే యంత్రాంగం ఇక్కడ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అయినా, ఇన్ని పక్షులు ఒకేసారి మృత్యువాత పడడం ఏమిటో ఎవరికీ అంతుపట్టడం లేదు.

నెల్లిరికాలువ నుంచి సూళ్లూరుపేట ప్రాంతం నుంచి మురికినీళ్ళు వచ్చి కలుస్తుండడంతో చెరువునీళ్ళు కలుషితమైపోతున్నాయా అనే కోణంలో కూడా పరిశీలనలు సాగించారు. నాయుడుపేట ఆర్డీఓ సరోజిని ఆధ్వర్యంలో ఒక బృందం కారిజాత గ్రామస్తులను కూడా విచారించింది. సూళ్ళూరుపేట మునిసిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, నీటిపారుదల శాఖ జేఇ రమేష్,డి.ఇ సతీష్‌బాబు, వన్యప్రాణి సంరక్షణ శాఖ రేంజర్ వేణు, తడ తహశీల్దార్ రామయ్య తదితరులంతా వచ్చి వివిధ కోణాల్లో పరిశీలనలు చేశారు. కలుషిత నీళ్ళ వల్లనే పక్షులు ప్రాణాలు కోల్పోయాయా?.. లేక ఏమైనా కలుషిత పదార్థాల వల్ల చనిపోయాయా?.. లేదా పక్షులకు ఏమైనా వ్యాధులు వచ్చాయా?.. వంటి విషయాలపై పరిశోధిస్తున్నారు. చెరువులో చేపలు కూడా చనిపోతుండడంపై దృష్టి పెట్టారు. చెరువులోకి కలుషిత నీళ్ళు రావడం అనేది ఎంతోకాలం నుంచి జరుగుతూనే ఉందని, ఇప్పటికిప్పుడు ఇన్ని పక్షులు ఎలా చనిపోయాయనే అనుమానాలూ లేకపోలేదు. చనిపోయిన పక్షుల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపి ఉన్న నేపథ్యంలో మరో రెండుమూడు రోజుల్లోనే పక్షుల మరణాలకు సంబంధించిన కీలకమైన సమాచారం తెలుస్తుందని అందరూ భావిస్తున్నారు. ఏదేమైనా, జిల్లా ఉన్నతాధికారులు వలస పక్షుల మరణాన్ని సీరియస్‌గా పరిగణించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, పక్షుల సంరక్షణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# మద్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టండి

జిల్లాలో మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు గట్టి నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ కేవిఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 7వ తేదీ గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో మద్యం అమ్మకాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో మద్యం ధరలు తక్కువగా ఉండటంతో అక్కడి నుండి జిల్లాకు అక్రమంగా మద్యం రవాణా అవుతోందన్నారు. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాలు తక్కువ అవుతున్నాయన్నారు. పోలీసు, ఎస్.ఇ.బి, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా బృందాలు ఏర్పాటుచేసి చెక్‌పోస్టుల వద్ద గట్టిగా నిఘా ఉంచాలన్నారు. వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్ఇబి జె.డి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి వారం ప్రత్యేక దాడులు నిర్వహించి అక్రమ రవాణాను నియంత్రించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటరత్నం, అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరామిరెడ్డి, వాణిజ్య శాఖ డి.సి దివ్యప్రత్యూష, ఏసిటిఓ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు 3 లక్షల దాకా రుణాలు

## డిసిసిబి ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి



జిల్లాలోని కౌలురైతులకు ఎలాంటి పత్రాలు లేకుండానే మూడు లక్షల రూపాయల దాకా రుణాలను అందిస్తున్నామని డిసిసిబి ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చెప్పారు. నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో ఆయన బ్యాంకు అధికారులతో ఈనెల 6న సమావేశమై రైతులకు బ్యాంకు అందిస్తున్న సహకారాన్ని సమీక్షించారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి డిసిసిబి 1600 కోట్ల రూపాయల వ్యాపారలక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. జిల్లాలోని 104 రైతుభరోసా కేంద్రాల ద్వారా 3 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశామన్నారు. అదేవిధంగా సంఘబంధాలకు లక్ష నుంచి 20 లక్షల దాకా రుణాలందిస్తున్నామని, త్వరలో జిల్లాలో ఏర్పాటుకానున్న అమూల్ డెయిరీ కోసం పాడిరైతులను ప్రోత్సహించేందుకు సొసైటీలను ఏర్పాటుచేసి రుణాలిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాబార్డ్ డిడిఎం రవిసింగ్, మెప్మా పీ.డి రవీంద్ర, డిసిసిబి సిఇఓ శంకర్‌బాబు, జీఎం సరిత, డిసిఎంలు నాగేంద్రకుమారి, ఉషారాణి, ఏజిఎం దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల కుటుంబాలకు..

# సోమిరెడ్డి పరామర్శ



మనుబోలు మండలంలోని టిడిపి నాయకుల కుటుంబాలను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 6న పరామర్శించారు. పిడూరుపాళెంలో గాలి వంశీకృష్ణారెడ్డి, మడమనూరులో కుంకాల నాగరాజు, చెర్లోపల్లిలో చిల్లకూరు సిద్దారెడ్డి, పర్లపాడులో సంజీవయ్యనాయుడు, బొల్లినేని కొండయ్య కుటుంబాలను సందర్శించి వారి కుటుంబసభ్యులను ఆత్మీయంగా పలకరించారు. మడమనూరులో కుంకాల నాగరాజు, పిడూరుపాళెంలో గాలి వంశీకృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ వారి మృతి తననెంతగానో బాధించిందన్నారు. కుంకాల నాగరాజు మృతితో అక్కడ ఏర్పాటుచేసిన సంతాపసభలో సోమిరెడ్డి పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పర్లపాడులో సంజీవయ్యనాయుడి భార్య చనిపోవడతో ఆయనకు తన సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు కుంకాల నాగేంద్రప్రసాద్, గాలి రామకృష్ణారెడ్డి, మస్తాన్‌నాయుడు, మధునాయుడు, నూనె లక్ష్మయ్య, ఉడతా విజయకుమార్, రాజాగౌడ్, వెంకటరమణయ్య, నలగర్ల వెంకయ్యయాదవ్, రాయపాటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రారంభం

## - నగరంలో భారీగా కవర్ల స్వాధీనం



నెల్లూరులో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలుచేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల6న నగరం లోని స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో ఉన్న రెండు గోడౌన్లపై కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ వెంకట రమణ, సిబ్బంది మెరుపుదాడులు చేశారు. ఓ గోడౌన్‌లో దాచివుంచిన సుమారు 500 కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

### నిషేధం పాటించండి

**- కమిషనర్ దినేష్ కుమార్**

50 మైక్రాన్ల లోపు ఉండే ప్లాస్టిక్‌ను నిషేధించామని, అయినా కొందరు వాటిని విక్రయిస్తున్నారని, మరికొందరు వినియోగిస్తున్నారని, ఇకనైనా అవగాహన తెచ్చుకుని పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ కొనుగోళ్ళు, అమ్మకాలు చేయవద్దని ఈ సందర్భంగా కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. ఎంతగా చెప్పినా మీలో మార్పు రాదా?.. అని ప్రశ్నించారు. ఈనెల 2వ తేది నుంచి నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించామని, అందరూ తప్పకుండా నిషేధం పాటించాలన్నారు. అదే విధంగా 75 శాతం మైక్రాన్ల లోపు ఉండే ప్లాస్టిక్ వినియోగం కూడా వద్దని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు కూడా ఈ విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## బీఇడి కాలేజీ ప్రిన్సిపాల్‌గా సుబ్బారావు

నెల్లూరు సంతపేటలో ఉన్న ప్రభుత్వ బీఇడి కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పాఠశాల విద్యాశాఖ గుంటూరు ఆర్‌జేడీ వి.ఎస్ సుబ్బారావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈనెల 6న పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు. వైస్ ప్రిన్సిపాల్‌గా ఆ కళాశాలలో సోషల్‌స్టడీస్ అధ్యాపకుడుగా పనిచేస్తున్న జయరామ నాయుడుకు బాధ్యతలు అప్పగించారు.

## కోవిడ్ టీకా వేయించుకోండి

జిల్లాలో ఇప్పుడు అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, గ్రామ-వార్డు సచివాలయాల్లో మెగా కోవిడ్-19 వ్యాక్సినేషన్ జరుగుతోందని, 18ఏళ్ల నిండినవారంతా టీకా వేయించుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి తెలియజేశారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి జిల్లాలో పనిచేస్తున్నవారికి, కార్మికులు, వలస కార్మికులకు అందరికీ ప్రతి ఆదివారం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టామని, అధికారులు తమ ప్రాంతాల్లో నూటికి నూరుశాతం వ్యాక్సినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

## విఆర్ విద్యాసంస్థలను కొనసాగించాలి

జిల్లాలోని చరిత్రాత్మకమైన విఆర్ విద్యాసంస్థలను పరిరక్షించాలని, ఎయిడెడ్ విద్యాసంస్థలను కొనసాగించాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈనెల 6న నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ నాయకులు నరసింహ, ఫయాజ్, సుబ్బరాయుడు, కృష్ణకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోవూరులో జనసేన కార్యాలయం



కోవూరులో ఈ నెల 3న జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభమైంది. జిల్లా జనసేన అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్ ఈ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే క్రమంలో వందలాదిమంది జనసైనికుల మధ్య జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీని జిల్లావ్యాప్తంగా బలోపేతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పినట్టు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన విజయఢంకా మోగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాసులురెడ్డితో పాటు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ల్యాబ్‌లు..ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు


# రిజిస్ట్రేషన్ తప్పనిసరి



జిల్లాలోని ల్యాబ్‌లు, ఆసుపత్రులకు తప్పకుండా రిజిస్ట్రేషన్ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఒకవేళ ఇప్పటి దాకా ఎవరైనా రిజిస్టర్ చేయించుకోని పక్షంలో వారు వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలని, వారం రోజుల లోగా రిజిస్టర్ చేయించుకోకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పదని ఆమె పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్ల వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అంటూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నేరమని హెచ్చరించారు. ప్రజలకు కూడా ఈ విషయం పట్ల అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్ వారు ప్రతి నెల 5వ తేదీ లోపు సంబంధిత స్కానింగ్ రిపోర్టులను వైద్యఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపాలన్నారు. కొత్తగా స్కానింగ్ సెంటర్ల అనుమతి కోసం, రెన్యూవల్స్ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిలో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకుంటూ ప్రభుత్వ నిబంధనలను పాటించాలని వివరించారు. ఈ సమావేశంలో ఏడిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ లలితాశేఖర్, డెప్యూటీ డెమో ఏ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రథమ వర్ధంతి

నాన్నా అపురూపంగా పెంచావు.. అభివృద్ధికి అద్భుత బాటలు పరిచావు..
మంచి మనిషిగా పదిమందిలో గుర్తింపు పొందావు.. అకాలంగా కాలధర్మం చెంది హృదయం బరువెక్కేలా చేశావు..
మరువరాని మరువలేని నీ స్మృతులు.. మా మదిలో పదిలం. నీకిదే మా నివాళి..



## స్వర్గీయ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి గారు

**01-07-1944 - 24-09-2020**

ప్రథమ వర్ధంతి (తిథుల ప్రకారం 13.10.2021) సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తె - అల్లుడు
**నిరూప - చెర్లో కోటారెడ్డి**

కుమారుడు - కోడలు
**పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి - సింధు**

మనమరాలు - మనవడు
**కామాక్షి హన్వీతారెడ్డి , వియాన్ష్‌రెడ్డి**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com